www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
ఆదివారం
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
రంగారెడ్డి। 15, డిసెంబర్ 2024
తెలుగు దిన పత్రిక
సంపుటి: 6 సంచిక: 196, పేజీలు: 12, వెల: రూ.5/-



## ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తాం

* ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి
* గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ (ఎస్సీ సబ్ ప్లాన్ -క్యాటిగరైజేషన్ ) అంశంపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సంక్లిష్టమైన ఈ అంశంలో ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు.గ్లోబల్ ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిక, చమర్ ఇతర అనుబంధ కులాలు (గ్లోబలిన్ఫార్మక్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ మాదిగ డే–2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.వర్గీకరణ అంశంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండ అమలు చేయాలన్న ఉద్దేశంతోనే అధ్యయనానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు దామోదర రాజనర్సింహా ,పొన్నం ప్రభాకర్ ,ధనసరి సీతక్క లతో కూడిన సబ్ కమిటీని నియమించిన విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే, వర్గీకరణ అంశంపై 60 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరుతూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శమీమ్ అఖ్తర్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ను నియమించామని, మరో వారం

మిగతా..2లో

## సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధ భూమే



* దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుంది
* అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారు
* కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, (వెలుతురు): కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి అల్లు అర్జున్‌కు మద్దతుగా

మిగతా..2లో

## దేశంలోనే తెలంగాణ..మధుమేహ రోగుల సంఖ్యలో 3వ స్థానం



* దేశంలోనే మూడోస్థానంలో నిలిచిన తెలంగాణ

హైదరాబాద్, (వెలుతురు): మధుమేహ రోగుల సంఖ్య విషయంలో తెలంగాణ.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనే మూడోస్థానంలో నిలిచింది. మన రాష్ట్రంలో మూడు పదులు పైబడిన వారిలో 14శాతంమంది షుగర్ పేషంట్స్ ఉన్నారని.. కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ

మిగతా..3లో

## మార్చి 3 నుంచే ఇంటర్ పరీక్షలు!!



* తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!
* పరీక్షల తేదీలపై కసరత్తు చేస్తున్న అధికారులు
* అధికారికంగా ప్రకటన వెలువడడమే తరువాయి

హైదరాబాద్, (వెలుతురు): ఇంటర్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, షెడ్యూల్ ఖరారు చేసే అంశం తుది దశలో ఉందని అధికార

మిగతా..2లో

# జనాభా ప్రాతిపదికన ఫలాలు పేదలకు అందాలి

### - దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్స కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14: జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం మేరకు పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ కులగణన తెలంగాణ ప్రజల మెఘా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుందని సీఎం అన్నారు.

హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ – దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, దొడ్డి



కొమురయ్య పోరాటాలను స్మరించుకున్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే, దొడ్డి కొమురయ్య ను శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు.

దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలి. విజ్ఞానం పంచాలి. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.రుణమాఫీ, వరికి బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని చెప్పారు.తెలంగాణకు జమిందారుల తల్లి కాదు. బహుజనుల తెలంగాణ తల్లి ఉండాలి. ఏ తల్లి అయితే మన అమ్మలాగా ఉంటుందో, అడక్కుండానే మన ఆకలిని గుర్తించి బుక్కెడు అన్నం పెడుతుందో అలాంటి తెలంగాణ తల్లిని తెచ్చుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు,

మన అమ్మకు ప్రతిరూపం. మన అక్కకు ప్రతిరూపం. ఒకపక్క వరి, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న వంటి తెలంగాణలో పండించే పంటతో పాటు నా బిడ్డలు చల్లంగా ఉండాలి. నా బిడ్డలు శాశ్వతంగా అభివృద్ధి పథంవైపు నడవాలని ఆశీర్వదించే తెలంగాణ తల్లిని మనం ప్రతిష్టించుకున్నామన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ ,హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ,మంత్రి పొన్నం ప్రభాకర్ ,ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ,కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి హెచ్ ఎం రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.




## చిలుకూరు సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో కామన్ డైట్‌ను ప్రారంభించిన సీఎం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెళుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14: శనివారం చేవెళ్ల నియోజకవర్గం చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామన్ డైట్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం

మిగతా..2లో



## సాహితీ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన నందిని సిధారెడ్డి: కేటీఆర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14: తెలంగాణ సాహితీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవి, రచయిత నందిని సిధారెడ్డి ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందిని సిధారెడ్డి తెలంగాణ ప్రభుత్వం ఇవ్వజూపిన రూ. 1 కోటి నగదు పారితోషికం మరియు ప్లాట్‌ను తిరస్కరించడం తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో సిధారెడ్డి చూపిన నిబద్ధత, తెగువ తెలంగాణ చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటుందన్నారు. తెలంగాణ కోసం కోటి రూపాయాలను, ప్లాట్‌ను

మిగతా..2లో

## దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం

* దానిని దెబ్బతీసేందుకు విషబీజాలు
* భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి
* ఇవి యావత్ దేశం గర్వపడే క్షణాలు
* దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది
* ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14(వెలుతురు): భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. ఎందరో మహానుభావులు కలిసి మన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశం గర్వపడే క్షణాలని అన్నారు. "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి.



మన రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దేశం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలి. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వార్థపరుల వల్ల అనేక కష్టాలు పడ్డాం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు.

మిగతా..3లో



## కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

* కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా
* థియేటర్‌లో అనుకోకుండా జరిగిన ఘటన
* ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్
* త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా
* చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్
* అల్లు అర్జున్ అరెస్టును ఖండించిన సినీ ప్రముఖులు

హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు): తనపై నమోదైన కేసుకు సంబంధించి అనేక విషయాలు మాట్లాడాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నట్లు అల్లు అర్జున్ స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ వద్ద విషాదకర సంఘటన జరగడం పట్ల మరోసారి బాధిత కుటుంబానికి క్షమాపణలు చెప్పిన ఆయన, త్వరలోనే ఆ కుటుంబాన్ని కలుస్తానని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తనకు మద్దతు

మిగతా..2లో




## విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం..

### షేక్ పేట్ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనాలు చేసిన మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14: రాష్ట్రంలో గురుకులాలు,సంక్షేమ వసతి గృహాల్లోని 8 లక్షల పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా కామన్ డైట్ మెనూ అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు 40 శాతం మెస్ చార్జీలను, 200% కాస్మటిక్ చార్జీలను పెంచామన్నారు. 1100 కోట్ల రూపాయలతో

మిగతా..2లో



## మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నాం

### తప్పు చేస్తే శిక్షపడాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు): జర్నలిస్ట్ రంజిత్‌పై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నామని, తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే అన్నారు. ఇటీవల మోహన్ బాబు తన ఇంట్లో ఓ జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ



ఘటనపై మంత్రి స్పందించారు.దాడిలో గాయపడిన జర్నలిస్ట్ వైద్య ఖర్చులను మోహన్ బాబు భరించాలన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమది ప్రజా ప్రభుత్వమని, జర్నలిస్ట్‌లపై దాడులకు చోటు లేదన్నారు. జర్నలిస్ట్‌ల రక్షణకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మోహన్ బాబు కుటుంబంలో వివాదం

మిగతా..2లో



## రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలి

* బీజేపీ రాజ్యాంగాన్ని రక్షిస్తాననడం విడ్డూరం
* లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 14(వెలుతురు): రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు. ఏకలవ్యుడి బొటనవేలిని ద్రోణుడు నరికించినట్లే అదానీ, అంబానీ లాభం కోసం చిన్న వ్యాపారుల వేలిని బీజేపీ కత్తిరించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. అగ్నివీర్,

మిగతా..2లో

## సాహితీ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన నందిని సిధారెడ్డి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి..

తిరస్కరించిన సిధారెడ్డి నిర్ణయంపై కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. అల్వాల్ లోని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కేటీఆర్, సిధారెడ్డి ఉద్యమకాల స్మృతులను నెమరు వేసుకున్నారు.ప్రభుత్వమే తెలంగాణ అస్థిత్వంపైన కుట్రలు చేస్తున్న ఈ తరుణంలో తెలంగాణ సమాజానికి నందిని సిధారెడ్డి గట్టి సందేశం పంపారని కేటీఆర్ అన్నారు. “తెలంగాణ బిడ్డలు తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి ఎన్ని త్యాగాలకైన వెనకాడరని, సిధారెడ్డి ఈ ధైర్యవంతమైన నిర్ణయం సమాజానికి గొప్ప సందేశం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణపై ప్రస్తుతం జరుగుతున్న అస్థిత్వ దాడులపై చర్చ జరిగింది. “ఇప్పుడు ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండి తమ హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణ సమాజం మరోసారి ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. “తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో కవులు, కళాకారులు ఎప్పుడూ ముందుంటారు,” అని కేటీఆర్ అన్నారు.నందిని సిధారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడిన కేటీఆర్, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. నందిని సిద్ధారెడ్డి తాను రాసిన కొన్ని పుస్తకాలను కేటీఆర్ కు అందజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బాల్క సుమన్, దేవి ప్రసాద్, దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

### ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై
## సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి..



రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని సీఎం చెప్పారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాలను గుర్తుచేశారు. ఈ కార్య క్రమంలో పలువురు నాయకులు, ఎస్సీ ఉప కుల నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యంలో ఈ వార్తను కవర్ చేసేందుకు జర్నలిస్టులు జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు. దీనికి సంబంధించి మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు కొట్టివేసింది.

## రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలి

మొదటిపేజీ తరువాయి..

ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. మద్దతుధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనావేలిని కత్తిరించారని దుయ్యబట్టారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేద్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి, భారతదేశాన్ని ఎలా నడపాలని ఆర్ఎస్ఎస్ సుప్రీం లీడర్ సావర్కర్ భావించారో చెబుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాలనుకుంటున్నాను. “రాజ్యాంగంలో చెత్త విషయం ఏమిటంటే, దానిలో భారతీయత ఏమీ లేదు. మనుస్మృతి అనేది మన హిందూ దేశానికి వేదాల తర్వాత అత్యంత పూజనీయమైనది. మన ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు ఆధారమైంది.” ఇవి సావర్కర్ చెప్పిన మాటలు. సావర్కర్ తన రచనల్లో మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగాన్ని మనుస్మృతితో భర్తీ చేయాలని ఆయన చెప్పారు. దానికి వ్యతిరేకంగానే మేం పోరాటం చేస్తున్నామన్నారు. మరోవైపు, భారత్‌లో అందరికీ సమాన ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇక్కడ మైనారిటీలకు ఎలాంటి హక్కులు ఉండడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ విపక్షాలకు హితవు పలికారు. 75 ఏళ్ల రాజ్యాంగ ప్రస్తానంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో మాట్లాడిన రిజిజూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్‌తోపాటు %బీణాూ% ప్రభుత్వాలు కూడా ఎంతో కృషి చేశాయని చెప్పారు. ఇప్పుడు విపక్షాలు వారి వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చవద్దని హితవు పలికారు. భారత్‌లో మైనారిటీలకు చట్టబద్ధమైన భద్రత ఉందన్న మంత్రి ప్రభుత్వం ఆ నిబంధనకు కట్టుబడి ఉందని వివరించారు. ఐరోపా దేశాల్లో 48 శాతం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు వివక్ష ఎదుర్కొంటున్నారని ఒక సర్వేలో తేలిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో బురాలు ధరించిన ముస్లింలపై అభ్యంతరం వ్యక్తం అవుతోందని గుర్తుచేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లోని సిక్కులు, హిందువులు, క్రైస్తవుల పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనని వివరించారు. టిబెట్‌లో అయినా మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో అయినా– మైనారిటీల పట్ల అణచివేత జరిగితే, వారికి ఏదైనా కష్టం వస్తే వారు రక్షణ పొందేందుకు మొదట వచ్చే దేశమేదైనా ఉందంటే అది భారతదేశమే. ఇది సురక్షితం కాబట్టే ఇక్కడకు వస్తారు. అలాంటప్పుడు ఈ దేశంలో మైనారిటీలకు భద్రత లేదని ఎలా అంటారు మైనారిటీ, మెజారిటీ వ్యక్తుల మధ్య, ప్రతీ ఇంట్లో ప్రతీ కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజం. అంతమాత్రాన దేశ ప్రతిష్టను దెబ్బతీసే మాటలు మాట్లాడకూడదు. ఒక పార్టీ కోసం ఈ మాట చెప్పడం లేదు, దేశం కోసం చెబుతున్నారాణి అన్నారు.

## మార్చి 3 నుంచే ఇంటర్ పరీక్షలు!!

మొదటిపేజీ తరువాయి..

వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ దాదాపుగా ఖరారైందని వివరించాయి. వచ్చే వారంలో అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అనధికారిక సమాచారం ప్రకారం.. మార్చిలో పరీక్షలు నిర్వహించాలని, ఆ నెలాఖరులోగా అన్ని పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.దీనికి అనుగుణంగా మార్చి 3వ తేదీ నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభిచనున్నట్లు సమాచారం. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలంటే మార్చి 3న పరీక్షలు ప్రారంభించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఇక, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఫిబ్రవరిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 3 తో ముగియగా ఆలస్య రుసుముతో జనవరి 2 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డ్ కల్పించింది. రూ.2 వేల ఆలస్య రుసుముతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 9 నుంచి 10 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. దీనికి తగ్గట్లు రాష్ట్రంలో పరీక్షలకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

## సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధ భూమే

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. “సినిమావాళ్లు చేసేది పక్కా బిజినెస్. హీరోలు డబ్బులు పెడుతున్నారు.. ఆ తర్వాత సంపాదించుకుంటున్నారు. వాళ్లేమైనా సరిహద్దుల్లో సైనికుల వలే యుద్ధాలు చేస్తున్నారా” అని నిన్న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ స్పందించారు. సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమేనని అన్నారు. దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుందని తెలిపారు. దేశభక్తి కేవలం సరిహద్దుల్లోనే కాదు, ప్రజల్లో స్ఫూర్తి నింపడంలో కూడా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అనేక సినిమా పాటలు దేశాన్ని కదిలించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారని, ఆయన విషయంలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

# చిలుకూరు సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో కామన్ డైట్‌ను ప్రారంభించిన సీఎం

మొదటిపేజీ తరువాయి..

మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, గురుకుల విద్య సెక్రటరీ శ్రీధర్, మహిళా చైర్మన్ శోభారాణి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్‌లతో కలిసి ఆవిష్కరించారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పిల్లల చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చును తెలంగాణను పునర్నిర్మాణంలో వారిని భాగస్వాములుగా,



భవిష్యత్తు తరాలను నిర్మించడానికి పెడుతున్న పెట్టుబడిగా మాత్రమేచూడాలన్నారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెంచడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని అధికారులకు సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థలతో పోల్చితే ప్రభుత్వ విద్యాలయాల్లో క్వాలిఫైడ్ టీచర్లు, మంచి వసతులు, మంచి జీతాలు ఉన్నా, ఎందుకు ప్రమాణాలు పెంచలేకపోతున్నామో ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మంది చదువుతుంటే, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది



విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో టాలెంట్ ఎక్కువగా ఉంటుందని, ప్రభుత్వ స్కూళ్లలో తక్కువగా ఉంటదన్న అపోహను తొలగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ స్కూళ్లల్లో చదువుతున్న వారు అనాధలు కాదు, వాళ్లు రాష్ట్ర సంపద అన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. 8 ఏళ్ళ నుంచి డైట్ చార్జీలను పెంచలేదు. 16 ఏండ్లుగా కాస్మొటిక్ చార్జీలను పెంచలేదు. ప్రజా ప్రభుత్వం అన్నీ పరిశీలించి 40 శాతం మేరకు డైట్ చార్జీలను 212 శాతం కాస్మొటిక్ చార్జీలను పెంచాం. గతంలో ఆరు నెల్లకో సంవత్సరానికో ఒకసారి నిధులు విడుదల చేసే వారు. ఇప్పుడు ప్రతి నెలా 10 వ తేదీలోగా గ్రీన్ చానెల్ ద్వారా నిధులు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నాం.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ దశ, దిశను మార్చడానికి, తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. భవిష్యత్తులో కూడా రెసిడెన్షియల్ స్కూళ్లను పరిశీలిస్తా. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులతో మెస్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి వారిని భాగస్వాములను చేయడం ద్వారా వారికి అవసరమైన ఆహారాన్ని వారే ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిసారీ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏదో ఒక సమస్య రాకుండా ముందుగానే పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. స్కూల్ యూనిఫామ్ బాధ్యతను రాష్ట్రంలోని మహిళా సంఘాలకు అప్పగించాం. కుట్టు పనికి ఇచ్చే రుసుమును కూడా రూ.25 నుంచి రూ.75 కు పెంచాం. స్కూళ్లకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాం. వారంలో రెండు మూడు రోజులు రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించాలని




ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించామని అన్నారు. ఈ కార్యక్రమం ముందుగా విద్యర్థినీలతో వాయిద్య పరికరాలతో ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాల నుండి మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థినీలకు ల్యాప్ ట్యాప్ లను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు,

# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం..

మొదటిపేజీ తరువాయి..

25వేల పాఠశాలల్లో

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించామని మంత్రి ప్రభాకర్ తెలిపారు.గురుకుల, వసతి గృహాల్లోని పిల్లలకు పుస్తకాలు, డ్రెస్సులు పాఠశాల ప్రారంభం రోజే అందించామని చెప్పారు,

మెస్ చార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తున్నామని అన్నారు,

క్రీడాభివృద్ధికి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేసి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు,చదువుతోపాటు క్రీడల్లో క్రియాశీలంగా ఉండాలి

సకల సౌకర్యాలు కల్పించామని మంత్రి ప్రభాకర్ తెలిపారు,

షేక్ పేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో వాటర్ ప్లాంట్, బోర్‌ఏర్పాటుకు 10 లక్షలు మంజూరు, పాఠశాల మరమ్మతులకు 25 లక్షలు మంజూరు,పాఠశాల లోని 20 మంది జూడో క్రీడాకారులకు

జూడో డ్రెస్‌లను అందిస్తున్నామని మంత్రి తెలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లు ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ గురు కులాలు, వసతి గృహాల్లో చదివే 8 లక్షల మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా 40 %డైట్ చార్జీలు,200% కాస్మెటిక్ పెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం హైదరాబాద్ షేక్ పేట సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బాయ్స్ కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో కలసి పాల్గొన్నారు. మంత్రి సంక్షేమ గురుకుల పాఠశాలలోని లైబ్రరీ సందర్శించి అందులోని పుస్తకాలను, కంప్యూటర్ రూమ్ ను డిజిటల్ క్లాస్ లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న కోర్సులను పరిశీలించారు. అనంతరం జ్యోతి పరిధిలోని చేసి కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రమంతా కన్నుల పండుగల ప్రారంభించుకున్నామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డైట్ ఛార్జి లతో పాటు 200 శాతం కాస్మోటిక్ ఛార్జిలను పెంచడం జరిగిందని స్పష్టం చేసారు. కామన్ డైట్ మెనూ కై ప్రతి యేటా రూ 470 కోట్లు అదనపు భారం పడుతుందని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 11వందల కోట్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణాలు, మరమ్మత్తులకు మరమ్మత్తులు చేపట్టామని అన్నారు.

రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో చదువుతున్న ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ హాస్టల్‌లలో బలమైన ఆహారాన్ని అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈరోజు హాస్టల్ లలో కామన్ డైట్ మెనూను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో గురు కులాల్లో చదువుతున్న దాదాపు 8 లక్షల మంది విద్యార్థులకు బలమైన ఆహారం అందించాలని నిపుణులైన డాక్టర్ల సమక్షంలో డైట్ మెనూ ఏర్పాటు చేశామని అన్నారు.

నేటి బాలలే రేపటి భవిష్యత్తు అని వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అభయ హస్తం ఇచ్చిందన్నారు. ప్రభుత్వం గురుకులాల్లో చేరిన వారికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు.



గత పాలకుల వలన 10 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందని విద్యావ్యవస్థను గాడిలో పెట్టి ఎన్నో విప్లవత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని స్పష్టం చేసారు. అదేవిదంగా ఉపాధ్యాయులకు ప్రమోషన్ లు ఇచ్చి బదిలీలు చేశామని, కొత్తగా ఉపాధ్యాయ నియమకాలు చేపట్టి అధ్యాపక వర్గ అసహనాన్ని తొలగించామని అన్నారు. అలాగే

ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అదేవిదంగా పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠశాలలో పుస్తకాలు, డ్రెస్‌లు సమయానికి అందించామని అన్నారు.ఇప్పుడున్న ధరలను పోలిస్తే 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. గత పాలకుల వలన గతంలో కిరాయిల ఇవ్వలేదని గురుకుల అద్దె భవనాలు ఖాళీ చేసే పరిస్థితి ఉంటే అద్దె బిల్లులు చెల్లించామని అలాగే మెస్ ఛార్జీలు గ్రీన్ ఛానెల్ ద్వారా చెల్లించడం జరుగుతుందని అన్నారు. దేశ భవిష్యత్ యువత పై ఉందని రాబోయే కాలంలో ఆరోగ్యంగా ఉంటూ మానసికంగా బలంగా ఉంటూ తెలంగాణ అభివృద్ధిలో మీరంతా భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు.ఈ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎక్కువగా జూడో ,చేస్ లో ఇక్కడ ఎక్కువగా ఆడుతున్నారని క్రీడలు వలన మానసిక ఉల్లాసం తో పాటు క్రీడాల వలన ఐక్యత, సోదరభావం పెరుగుతుందని అన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ నవ రత్నాలు స్థాపించి టెక్నికల్ గా దేశం ఎక్కడికో ఎదిగిందని ఈ సందర్భంగా గుర్తుచేసారు.మీకు మున్సిపల్ వాటర్ రేపటి నుండి ఉచితంగా అందించడం జరుగుతుందని అలాగే ఒక బోర్ వేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని అన్నారు.మౌళిక వసతులు కల్పనలు 25 లక్షలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.20 మంది జూడో క్రీడాకారులకు జూడో డ్రెస్ లు కలెక్టర్ ఆధ్వర్యంలో అందిచడం జరుగుతుందని తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వస్తుందని, అక్కడ కూడా పెద్ద ఎత్తున సీట్లు సంపాదించాలని సూచించారు.తెలంగాణ రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు పెరుగుతున్నాయని ప్రజా రవాణా వ్యవస్థలో చట్టాలను కఠినంగా చేపడుతామని అలాగే

నెలరోజుల్లో ఇక్కడ ట్రాఫిక్ అవేర్నెస్‌పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థులకు రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.తదుపరి డైనింగ్ హాల్ లో విద్యారలతో మంత్రి, కలెక్టర్ కలసి సహాపంక్తి భోజనం చేసారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టల్ లలో వసతులు మెరుగు పడేలా40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రతి సంవత్సరం 470 కోట్లు రూపాయల అదనపు భారం పడుతున్నప్పటికీ డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. వసతి గృహాల్లో సానిటేషన్, వెంటిలేషన్, హైజానిక్, మరియు రుచికరమైన ఆహారం అందించుటకు ఇది తొలి అడుగు అని అన్నారు.ప్రభుత్వం విద్యార్థులకు మంచి చదువు, ఆహారం అందిస్తుందని అన్నారు. విద్యయే ప్రగతికి తొలిమెట్టు, చదువుకు మించిన ఆస్తి లేదు దాన్ని మించిన గౌరవం లేదని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్విని ఏం చేసుకొని

తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలనితమ ఇన్స్టిట్యూషన్ కు, ఊరికి గర్వకారణంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, ఆర్డిఓ సాయిరామ్, ఇంచార్జ్ డిడి సోషల్ వెల్ఫేర్ కోటాజీ,ప్రిన్సిపాల్ బాలస్వామి, డిఎఫ్ఓ ప్రత్యేక అధికారి టి.వెంకన్న, ఈఈ ఆర్‌అండ్ బీ ఈఈ మనోహర్ బాబు, డి ఎం సివిల్ సప్లై సాయి అరుణ్ కుమార్,తహసీల్దార్ నయిామోద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

మొదటిపేజీ తరువాయి..

ఇస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై చూపించిన ప్రేమ, అభిమానానికి అభిమానులకు, దేశవ్యాప్తంగా మద్దతిచ్చిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగింది అనుకోని ఘటన అని, అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఇప్పటి వరకు 30 సార్లు సంధ్య థియేటర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. మరోవైపు జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్‌కు ప్రముఖుల నుంచి పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందమూరి బాలకృష్ణ స్వయంగా అల్లు అరవింద్‌కు ఫోన్ చేసి అల్లు అర్జున్‌తో మాట్లాడి పరామర్శించారు. ఈ మేరకు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ‘పుష్ప’ దర్శక నిర్మాతలతో పాటు హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రానా, నాగచైతన్య, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, కొరటాల శివ, వంశి పైడిపల్లి, బి.గోపాల్, ఆర్. నారాయణమూర్తి, నిర్మాతలు సురేశ్ బాబు, దిల్ రాజు, బీవీఎస్ఎన్ ప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ సహా పలువురు సన్నిహితులు, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్‌లు అల్లు అర్జున్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. కాసేపు అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముఖ్యంగా చిరంజీవి సతీమణి సురేఖ అల్లుఅర్జున్ నివాసానికి చేరుకోగానే సోదరుడు అల్లు అరవింద్ దగ్గరుండి బన్నీ వద్దకు తీసుకెళ్లారు. తనను హత్తుకొని సురేఖ ఒకింత భావోద్వేగానికి గురికావడంతో అల్లు అర్జున్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇలా సినీ, రాజకీయ ప్రముఖులు, సన్నిహితులతో అల్లు అర్జున్ నివాసం వద్ద సందడి నెలకొంది. మరోవైపు అభిమానులు ఎవరూ అర్జున్ నివాసానికి రాకుండా పోలీసులు మూడు వైపుల బారికెడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అల్లుఅర్జున్ అరెస్టుపై యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అరెస్టును ఖండిస్తూ పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపారు. మంచి సమాజంలో జీవించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని, ఆ ఘటన నుంచి పరిశ్రమ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని నిందించడం సరైనది కాదని నాని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ కూడా ఇదే అంశంపై ఓ సినీ వేడుకలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరని, జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టుపక్కల వారికి సూచిస్తుంటారని వరుణ్ ధావన్ తెలిపారు. ఈ విషయంలో ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయమన్నారు. పుష్ప–2 కథానాయిక రష్మిక కూడా బన్నీ అరెస్టుపై ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తాను నమ్మలేకపోతున్నానని, సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకరమని, ఆ ఘటన తన హృదయాన్ని కలచివేస్తుందని పేర్కొంది. అదే సమయంలో ఒకే వ్యక్తిని నిందించడం సబబు కాదని అల్లు అర్జున్‌కు రష్మిక తన మద్దతు ప్రకటించింది. థియేటర్ల వద్ద తొక్కిసలాట ఘటన బాధాకరమన్న నటుడు నితిన్ ఈ ఘటనను తప్పుపట్టడం కంటే దాన్ని నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. మరో కథానాయకుడు సందీప్ కిషన్ కూడా బన్నీ అరెస్టును తప్పుపట్టారు. ఊహించని ఘటనలో ఒకే వ్యక్తి ఎలా బాధ్యత వహించగలరని ప్రశ్నించారు. దర్శకుడు అనిల్ రావిపూడి కూడా స్పందిస్తూ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మెరుగైన భద్రత అవసరాలను గుర్తు చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చూసుకుందామని పిలుపునిచ్చిన అనిల్, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో అర్జున్ బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్కరినే బాధ్యత వహించమనడం సరైన నిర్ణయం కాదని అనిల్ అభిప్రాయపడ్డారు. మరో దర్శకుడు అజయ్ భూపతి అల్లు అర్జున్ అరెస్టును ఖండించారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ అల్లు అర్జున్ అరెస్టుపై ప్రభుత్వాలకు నాలుగు ప్రశ్నలు సంధించారు. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల్లాంటి ఉత్సవాల్లో తోపులాటలో భక్తులు పోతే దేవుళ్ల అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఎన్నిక ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా చనిపోతే రాజకీయ నాయకులన్ని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించిన వర్మ, ప్రీ రిలీజ్ ఫంక్షన్లలో ఎవరైనా పోతే హీరో హీరోయిన్లను అరెస్టు చేస్తారా అంటూ తనదైన శైలిలో ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే భద్రత ఏర్పాట్లు పోలీసులు, నిర్వహకులు తప్ప హీరోలు, ప్రజా నాయకులు ఎలా నియంత్రించగలరని ఆర్జీవీ ప్రశ్నించారు. అల్లు అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలియగానే జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి కుటుంబసభ్యులు, సన్నిహితులు తరలివచ్చారు. మెగాస్టార్ చిరంజీవి దంపతులతోపాటు మెగా బ్రదర్ నాగబాబు, రానా, దర్శకులు సుకుమార్, రాఘవేందర్‌రావు వచ్చి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

అటు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు నిర్మాత దిల్‌రాజు వచ్చి స్టేషన్‌లో ఉన్న బన్నీని కలిసి ధైర్యం చెప్పారు. నాంపల్లి కోర్టుకు దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు నాగవంశీ, బన్నీ వాసు, ఎస్‌కేఎన్ సహా ఆయన సన్నిహితులు హాజరై కోర్టులో జరుగుతున్న పరిణామాలను గమనించారు. ఎప్పటికప్పుడు అల్లు అర్జున్‌కు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. అల్లు అర్జున్ అరెస్టుపై మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్ ఏ విధంగా స్పందిస్తారనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



## తన వివాహానికి హాజర్ కావాలని సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన క్రీడాకారిణి పీవీ సింధు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14:**
తన వివాహానికి హాజరైన ఆశీర్వాదం అందించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని శనివారం నాడు సీఎం స్వగృహంలో కలిసిన ప్రముఖ బ్యాట్మెంటన్ క్రీడాకారిణి పీవీ సింధు. కాగా సింధు తన కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వానించిన ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు, తప్పక హాజరు అవుతానాన్ని సీఎం రేవంత్ రెడ్డి సింధు కుటుంబ సభ్యులకు తెలిపారు,




## గుకేష్‌కు ఇచ్చిన గిఫ్ట్‌ను గుర్తు చేస్తూ ఫోటో షేర్ చేసిన ఆనంద్

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 14:**
వరల్డ్ చెస్ ఛాంపియన్ "గుకేష్ దొమ్మరాజు" గత చరిత్ర శృతులను షేర్ చేసిన మాజీ వరల్డ్ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ , గుకేష్ పసిబాలుడిగా ఉన్నప్పుడు మాజీ వరల్డ్ చెస్ ఛాంపియన్ విశ్వనాధ్ ఆనంద్ నుంచి చదరంగ రాజును బహుమతిగా అందుకుంటున్నప్పటి ఫోటో ను షేర్ చేశారు.

## రబీ పంటలకు నీటిని విడుదల చేసిన మంత్రి ఉత్తమ్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 14:**
నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్ మరియు ఎస్ ఆర్ ఎస్ పి ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డిసందర్శించారు ,నిజాంసాగర్ డ్యాం నుండి రబీ పంటకు పూజా కార్యక్రమాలు నిర్వహించి నీటిని విడుదల



చేశారు. ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్టు ఆనకట్ట వద్ద సమావేశం నిర్వహించి 2024 డిసెంబర్ 25 నుంచి రబీ పంటకు నీరు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సలహా మండలి చైర్మన్ పోచారం శ్రీనివాసరెడ్డి,పలువురు ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ

### నిరుద్యోగులకు డిప్యూటీ సీఎం తీపి కబురు

**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** నిరుద్యోగులకు తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. త్వరలోనే 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ వేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈరోజు రాష్ట్రవ్యాప్త ఒకరోజు హాస్టల్ తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మధిర, బోనకల్‌లోని సంక్షేమ, గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 10 సంవత్సరాలుగా మెస్, 16 సంవత్సరాలుగా కాస్మోటిక్స్ ఛార్జీలలో పెరుగుదల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామన్నారు. అలాగే త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

# దేశంలోనే తెలంగాణ..మధుమేహ రోగుల సంఖ్యలో 3వ స్థానం

**మొదటి పేజీతరువాయి..**
శాఖ తాజాగా పార్లమెంట్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. అసంక్రామిక (ఒకరి నుంచి మరొకరికి సోకని) వ్యాధుల (ఎన్‌సీడీ) పోర్టల్ ప్రకారం ఈ ఏడాది నవంబర్ 30 వరకూ అన్ని రాష్ట్రాల్లో నమోదైన డయాబెటిస్ గణాంకాల వివరాలను అందులో వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎమ్)లో ఒక కార్యక్రమమైన ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో భాగంగా 30 ఏళ్లు దాటిన వారికి వైద్య, ఆరోగ్యశాఖ రక్తపోటు, మధుమేహానికి సంబంధించిన పరీక్షలు చేశారు. మొదటి రెండు స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్ర ఉన్నాయి. పంజాబ్‌లో 20.51 లక్షల మందికి పరీక్షలు చేయగా.. ఏకంగా 6.73 లక్షల మందికి (32.82 శాతం) మధుమేహం ఉన్నట్టు తేలింది. మహారాష్ట్రలో 2.49 కోట్లమందికి పరీక్షలు చేయగా.. 40.03 లక్షల మంది (16 శాతం) డయాబెటిస్ బాధితులున్నట్టు వెల్లడైంది. మూడో స్థానంలో తెలంగాణ ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా రాజస్థాన్ (13 శాతం), కర్ణాటక (12 శాతం), మధ్యప్రదేశ్ (11 శాతం) ఉన్నాయి. ఇక చిన్నవైన ఈశాన్యరాష్ట్రాల్లో నాగాలాండ్‌లో 32 శాతం, సిక్కింలో 25 శాతం షుగర్ వ్యాధిగ్రస్తులున్నట్టు ఎన్‌సీడీ లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 55 శాతం కేసులతో పుదుచ్చేరి అగ్రస్థానంలో ఉంది. అక్కడ లక్ష మందికి పరీక్షలు చేయగా అందులో 55 వేలమందికి షుగర్ ఉన్నట్లు తేలింది. అండమాన్ నికోబార్‌లో 23 శాతం మంది మధుమేహులున్నారు. మన దగ్గర పట్టణ, నగర జనాభా ఎక్కువ. తెలంగాణలో 42 శాతం మంది పట్టణాల్లో ఉంటున్నారు. ఉద్యోగులు, వైట్ కాలర్ జాబ్ చేసే వారి సంఖ్యా ఎక్కువే. మనది ధనిక రాష్ట్రం కావడంతో అలవాట్లు కూడా అలాగే మారాయి. చాలామంది ఇంట్లో తినడం మానేసి బయటే ఎక్కువగా తింటున్నారు. దేశంలో ఏ నగరంలోనూ లేని విధంగా మన హైదరాబాద్‌లో రెస్టారెంట్లు, హోటళ్లు అన్నీ కలిపి 72 వేలకు పైగా ఉన్నాయంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జీవనశైలి చాలా మారింది. శారీరక శ్రమ తగ్గింది. వరి అన్నం ఎక్కువగా తినడం, ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, ధూమపానం, మద్యపానం, కొద్ది దూరాలకు కూడా.. నడవడం మానేసి వాహనాలపై వెళ్లడం వంటి అలవాట్లతో మనదగ్గర షుగర్ పేషంట్స్ పెరుగుతున్నారు. 30ల్లోనే డయాబెటిస్ కేసుల సంఖ్య పెరుగుతోంది. 25 ఏళ్లకే ప్రీ-డయాబెటిస్ కేసులు వస్తున్నాయి. పిల్లల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. శారీరక శ్రమ, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవర్చుకోవాలంటున్నారు డాక్టర్లు. ఆఫీసులో పనిచేసేవారైతే.. ఎక్కువసేపు కదలకుండా కూర్చోకూడదు. కనీసం అరగంట %-% గంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరగాలి. నిత్యం వ్యాయామం చేయడం లేదా వారానికి కనీసం మూడు రోజులైనా కసరత్తులు చేయడం మంచిది. కంటి నిండా నిద్ర కూడా ముఖ్యమే. రోజుకు ఎనిమిది గంటలపాటు.. అంతరాయం లేని నిద్ర ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది. మధుమేహం బారిన పడ్డట్టు నిర్ధారణ అయిన వెంటనే.. బరువు తగ్గగలిగితే రక్తంలో చక్కెరస్థాయిలను అదుపులో ఉంచవచ్చని ఒక అధ్యయనంలో వెల్లడైంది. వైద్యులు, పోషకాహార నిపుణుల సాయంతో ఆహారపుటలవాట్లను మార్చుకుని, రోజూ వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గడానికి ప్రయత్నం చేయాలి. భారీ స్థూలకాయంతో బాధపడేవారు, బాడీ మాస్ ఇండెక్స్ 35 కంటే ఎక్కువగా ఉండేవారు.. షుగర్ వచ్చిన తొలినాళ్లలో.. వైద్య నిపుణులను సంప్రదించి, బేరియాట్రిక్ సర్జరీ వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలించవచ్చు. మధుమేహాన్ని పూర్తిగా నయం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు చాలా పరిశోధనలే చేస్తున్నారు. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, షుగర్ ఉన్నా లేనట్టే జీవించేలా చేసే ఇన్సులిన్ మాత్రల వంటి ప్రయోగాలు చాలా జరుగుతున్నాయి. అవి విజయవంతమై షుగర్‌ను నయం చేసే మందులు అందుబాటులోకి వచ్చే దాకా మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే.దేశంలో దక్షిణాది రాష్ట్రాలు డయాబెటిస్ కేంద్రాలుగా మారుతున్నట్టు ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది చేసిన పరీక్షల్లో మధుమేహ బాధితులుగా తేలినవారు దేశం మొత్తమ్మీదా కలిపి 2.96 కోట్ల మంది ఉండగా.. అందులో 1.36 కోట్ల మంది ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచే ఉన్నారు.

# దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం

**మొదటి పేజీతరువాయి..**
దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు" అని మోదీ అన్నారు. ఉపాధిని వెతుక్కుంటూ పేదలు పలు ప్రాంతాలకు వెళ్తారని, పేదలకు ఇబ్బంది లేకుండా 'వన్ నేషన్ - వన్ రేషన్ కార్డ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. "పేదలు ఎక్కడున్నా రేషన్ సులువుగా తీసుకోలగాలి. ఆయుష్మాన్ కార్డు ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నాం. డిజిటల్ ఇండియా దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాజ్యాంగం అన్ని భాషలను గౌరవించింది. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుంది" అని మోదీ అన్నారు. "మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడు సార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని అప్పటి స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఎంతోమంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారు" అని మోదీ వ్యాఖ్యానించారు. "ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులు హరించారు. వేలాది మందిని జైళ్లకు తరలించారు. కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు పన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారు. కీలక నిర్ణయాలు




తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనం" అని మోదీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై రెండో రోజులుగా చర్చ జరుగుతోంది. అధికార, విపక్ష ఎంపీలు రాజ్యాంగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజ్యాంగంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తున్నారు. నిన్న రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. దీనిపై విపక్షాల నుంచి ప్రియాంక గాంధీ స్పందించారు. రెండో రోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. రెండో రోజు కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో అదానీ, అగ్నివీర్, పార్శ్వ ప్రవేశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు.ఈ నేపథ్యంలోనే విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు వచ్చారు. ప్రధాని మోదీ లోక్‌సభకు చేరుకోగానే బీజేపీ ఎంపీలు జై శ్రీరామ్ నినాదాలు చేయడం ప్రారంభించారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర గొప్ప ప్రయాణం అని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది సంబరాలు జరుపుకోవాల్సిన క్షణం అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న వారందరికీ ప్రధాని మోదీ అభినందనలు.లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ స్పందిస్తూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ఆ సమయంలో భారతదేశానికి వ్యక్తీకరించిన అన్ని అవకాశాలను అధిగమిస్తూ భారత రాజ్యాంగం ఇక్కడికి తీసుకువచ్చిందని అన్నారు. ఈ గొప్ప విజయానికి రాజ్యాంగ నిర్మాతలతో పాటు దేశంలోని లక్షలాది మంది పౌరులకు గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో చాలా స్పృహతో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. 1950 నుంచి భారతదేశంలో ప్రజాస్వామ్యం వస్తోందని నమ్మలేదు. భారతదేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్ర గతం చాలా గొప్పది. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు ప్రధాని మోదీ. అందుకే భారతదేశాన్ని నేడు ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారు. మనది భారీ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రాజ్యాంగంలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోదీ అన్నారు. చాలా దేశాలు మహిళలకు ఓటు హక్కును చాలా ఆలస్యంగా ఇచ్చాయని, అయితే భారతదేశంలో రాజ్యాంగం మొదటి నుండి మహిళలకు ఈ హక్కును కల్పించిందని ఆయన గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు . అందుకే భారతదేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పిలుస్తారు. మనది పెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. మనం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

### ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించిన హరీశ్‌రావు

### వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం

### కనీసం నాణ్యమైన ఆహారాన్ని కూడా అందించలేరా..? : హరీశ్‌రావు

**హైదరాబాద్, డిసెంబర్ 14 (వెలుతురు):**
విద్యార్థుల ఆరోగ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా విద్యార్థులు ప్రాణాలు సంకటంగా మారాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని పేర్కొన్నారు. నాలుగు రోజులు గడించినా అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా






నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారు. సబితా ఇంద్రా రెడ్డిని, సత్యవతి రాథోడ్‌ని అరెస్టు చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తుపై లేదా? నిన్న నల్గొండ - కేతేపల్లి మండలం గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న నీలం సాయి గణేష్ పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రి పాలయ్యాడు. ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాక్‌లు నిత్య కృత్యం అవుతున్న ప్రభుత్వం ముద్దు నిద్ర వేడడం లేదు. ఇప్పటి వరకు 49 మంది విద్యార్థులు చనిపోతే ఉలుకు లేదు పలుకు లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఎట్లుండే తెలంగాణ ఎట్ల అయింది

### ఆసుపత్రుల్లో బెడ్ల కోసం పిల్లల పోటీ

### గురుకుల పిల్లలను చూస్తే బాధేస్తోంది.. : కేటీఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 14 (వెలుతురు):** ఎట్లుండే తెలంగాణ.. ఎట్ల అయింది.. ముఖ్యంగా గురుకుల పిల్లలను చూస్తే బాధేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు.సామాన్య విద్యార్థుల్లో భయాందోళనలు, తల్లిదండ్రులలో ఆవేదన రేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠాలు చెప్పే చోట పాము కాట్లతో పసిబిడ్డల ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు ఎవరెస్టు వంటి శిఖరాలను అధిరోహిస్తే .. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆసుపత్రి బెడ్లను ఎక్కించారని కేటీఆర్ విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకుల విద్యాలయాల్లో సీట్ల కోసం పోటీ పడితే ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆసుపత్రుల్లో బెడ్ల కోసం పోటీ పడుతున్నారని పేర్కొన్నారు.

దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్టు ఇప్పుడు గురుకులాల బాటపట్టారు. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫొటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. కెమెరాల ముందు హంగామా చేసుడు కాదు.. గురుకుల బిడ్డల గుండెచప్పుడు వినండి. మంది మార్బలంతో దండయాత్ర చేయకండి.. గురుకుల సమస్యలను తీర్చే ప్రయత్నం చేయండి అని కేటీఆర్ సూచించారు. చివరకు ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

### పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు

### తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, డిసెంబర్ 14 (వెలుతురు):** రాష్ట్ర వ్యాప్తంగా రేపు, ఎల్లుండి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కారణాల వల్ల గ్రూప్-2 పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెప్పులే ధరించాలన్నారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు.

# సంపాదకీయం

## అల్లు అరెస్టులో రాజకీయ అత్యుత్సాహం

ఎవరైనా ప్రముఖుని అరెస్టు జరిగిన సందర్భంలో సహజంగానే చర్చ అంతా ఆ వ్యవహారం చుట్టే తిరుగుతుంది. మంచి చెడులు తప్పొప్పుల మాటలు అప్పుడు కనిపించవు. ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తారు. ప్రజాదరణ కలిగిన నటుడు అల్లు అర్జున్ అరెస్టు విషయంలోనూ ఇదే జరుగు తోంది. ఇందులో వింత ఏమీ లేదు. ఈ అరెస్టు వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది. అయితే అల్లు అర్జున్ అరెస్టుపై సినిమా ఇండస్ట్రీ కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, నేతలు స్పందించారు. ఇంకా స్పందిస్తూనే ఉన్నారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయి స్పందన రాలేదు. అల్లు అర్జున్‌కు రాజకీయాలకు సంబంధం ఏమిటి అనే ప్రశ్న ఇప్పుడు అనివార్యంగా వస్తుంది. అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు ఆగమేఘాల మీద స్పందించారు. అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఆ తర్వాత బీజేపీ నుంచి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నాయకులు స్పందించి.. అరెస్టును తప్పుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ కాబట్టి వీరు అరెస్టయిన వ్యక్తికి మద్దతు ఇచ్చారని అనుకోవచ్చు. కానీ ఈ ఒక్క కారణం సరిపోతుందా అనేది ప్రజలే తేల్చాలి.

క ఇదే సమయంలో కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్ రెడ్డి మొదలుకొని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వరకూ ఈ అరెస్టుపై స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి.. చట్టం తన పని తాను చేసుకుపోతుందనేది రొటీన్ డైలాగ్. వీరూ అదే మాట చెప్పారు. అరెస్టును



సమర్థించారు. నిజమే చట్టం తన పని తాను చేసుకుపోతుంది.. చేసుకుపోవాలి కూడా. కానీ ఇంత అత్యుత్సాహంతో ..వదిలితే ఇక దొరకడు అన్న విధంగా ఆగమేఘాల మీద అరెస్టు చేయటం అవసరమా? అనేది కూడా ప్రజలే తేల్చుకోవాలి.

ఇక, వ్యవహారం సినిమా స్టార్ కు సంబంధించినది కనుక ఏపీ రాజకీయ పార్టీలు కూడా స్పందించాయి. ఐతే, అధికార టీడీపీ,, జనసేన పార్టీ నుంచి పెద్దగా స్పందన లేదు. ద్వితీయ శ్రేణి నాయకులు స్పందించి, అరెస్టును ఖండించారు. కానీ, ప్రతిపక్ష వైసీపీ తీరు ఆసక్తికరంగా ఉంది. పార్టీ అధినేత  జగన్ మొదలు.. సాధారణ కార్యకర్త వరకూ బన్నీఅరెస్టుపై స్పందించారు. అన్ని పార్టీల కంటే ఓ అడుగు ముందుకేసి.. అల్లు అర్జున్ అరెస్టు వెనక చంద్రబాబు కూడా ఉన్నారని వైసీపీ ఆరోపించింది. ఇక వైసీపీ సోషల్ మీడియా అయితే.. గతంలో ఎప్పుడూ లేనివిధంగా సపోర్ట్ పోస్టింగ్ పెట్టింది. 'నువ్ మా కోసం నిలబడ్డావ్.. మేము నీ కోసం నిలబడతాం' అంటూ వైసీపీ కార్యకర్తలు పోస్టులు పెట్టారు. అటు బన్నీ కేసులో హైకోర్టులో వాదించిన లాయర్ నిరంజన్ రెడ్డి

వైసీపీ తరఫున రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. దీంతో ఈ వ్యవహారాన్ని వైసీపీ ఓన్ చేసుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్ లో కాపు నేతగా పవన్ కల్యాణ్ కు బన్నీ ద్వారా చెక్ పెట్టే వ్యూహం ఏమైనా దీనిలో ఉన్నదా అనే అనుమానం కలుగుతుంది.

ఇది ఇలావుంటే, బన్నీ అరెస్టు వ్యవహారంలో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. పుష్ప–2 సక్సెస్ మీట్ సందర్భంగా అల్లు అర్జున్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి పేరు చెప్పలేదని.. అందుకే కక్షగట్టి అరెస్టు చేశారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇలాంటివి సోషల్ మీడియాలో సహజం. ఈ దెబ్బతో 'మరోసారి రేవంత్ రెడ్డి పేరు మర్చిపోరు' అంటూ పెడుతున్న కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

మొత్తానికి అల్లు అరెస్టు.. అటు రాజకీయ, ఇటు సినిమా ఇండస్ట్రీని ఒక రోజంతా షేక్ చేసింది. ఒకే రోజులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం మామూలే. కానీ ఒకే రోజులో అరెస్టు చేసి, రిమాండ్ విధించి జైలుకు తరలించి, ఆ వెంటనే బెయిల్ మంజూరు అయిన సందర్భాలు అరుదు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధిస్తే.. హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఏదేమైనా, గత కొంత కాలంగా తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు సర్వత్రా ఆసక్తికరంగా మారాయి. ఓ వైపు.. మంచు ఫ్యామిలీ ఎపిసోడ్ నడుస్తుండగానే.. ఇప్పుడు ఐకాన్ స్టార్ అరెస్టు దుమారం. త్వరలో మోహన్ బాబు కూడా అరెస్టు అవుతారనే మాట మీడియాలో వినిపిస్తోంది. ఎవరినీ ఎవరు ఊరకే ఎందుకు అరెస్టు చేస్తారు? టాలీవుడ్ సెలెబ్రిటీలపై రేవంత్ సర్కార్ కఠినంగా వ్యవహరిస్తుందనేది ఎంతవరకు కరెక్ట్? నిజంగానే టాలీవుడ్ మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందా? నిజానికి 'టాలీవుడ్ వర్సెస్ రేవంత్ రెడ్డి సర్కార్' అన్న చర్చ.. అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయటంతోనే మొదలైందని అంటున్నారు. అక్రమాల నుంచి సినీ తారలకు మినహాయింపు ఇవ్వాలా? నేరారోపణలు వచ్చినపుడు చూసీచూడనట్టు వదిలేయాలా? ఇదేనా ప్రతిపక్షాలు కోరుకునేది. చట్టం ముందు అంతా సమానులే..అన్యాయం జరిగితే కోర్టులు ఉన్నాయి. ఇకనైనా ప్రతిభుత్వం చేసే ప్రతి పనికి వక్రభాష్యం చెప్పే దోరణనిని ప్రతిపక్షాలు విడనాడాలి. ఇదే సమయంలో ప్రభుత్వం అత్యుత్సాహాన్ని కాస్త తగ్గించుకుంటే మంచిది.

## వచ్చే ఒలింపిక్స్‌కు

క్రీడల్లో మన తెలంగాణ బిడ్డలు ప్రపంచ దేశాల సరసన ఎందుకు నిలబడద్దు! పతకాలు కొన్ని దేశాలకే పరిమితమా! మనం ఎందుకు వెనుకపడుతున్నాం! ఎందుకు విశ్వవిజేతలుగా నిలవడం లేదు! – అనుకుంటే లక్ష్యాన్ని సాధించే సత్తా తెలంగాణ బిడ్డలకు ఉంది. పట్టుదల, క్రమశిక్షణతో కఠోరంగా శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే ఆలోచనతో సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టి సరైన శిక్షణను ఇప్పించి అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ క్రీడాకారులుగా తెలంగాణ బిడ్డలను తయారు చేయాలనే ఉక్కు సంకల్పంతో యంగ్ ఇండియా తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 200 ఎకరాల్లో ఈ యూనివర్సిటీని హైదరాబాద్‌లోని ముచ్చర్లలో నిర్మిస్తారు.

అంతర్జాతీయ వేదికల్లో తెలంగాణ నుంచి మన క్రీడాకారులే అత్యధికంగా పతకాలు సాధించి తెచ్చే స్థాయిలో రాష్ట్రాన్ని క్రీడా రంగంలో గొప్పగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీలోని (ఫోర్త్ సిటీ) స్పోర్ట్స్ హబ్‌లో దాదాపు 12 క్రీడల అకాడమీలను నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తున్నది. వీటిలో అంతర్జాతీయ స్థాయిలో అధునాతన సదుపాయాలు కల్పించనున్నారు. ఈ స్పోర్ట్స్ హబ్‌లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటాయి. క్రీడాకారులకు శిక్షణతో పాటు తగిన పరిశోధనలకు నిలయంగా వర్సిటీ రూపుదిద్దుకోనుంది. ప్రతి క్రీడకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది.

# సవాలుగా మారుతున్న వృద్ధుల సంరక్షణ



భారతదేశంలో వృద్ధుల జనాభా గణనీయంగా పెరుగుతోంది. అరవై ఏళ్లు దాటిన వారు 2021 నాటికి మొత్తం జనాభాలో 10.1 శాతం ఉండగా, 2036 నాటికి 15 శాతానికి, 2050 నాటికి 20.8 శాతానికి పెరుగుతుందని 'ఇండియా ఏజింగ్ రిపోర్టు 2023' వెల్లడించింది. అయితే వృద్ధులకు తగినట్టు నగరాలు, గ్రామాల్లో వాతావరణం ఉండడం లేదు. నీరు, గాలి అంతా కలుషితమై చాలా సమస్య లను తెచ్చిపెడుతోంది. స్వల్ప, మధ్య ఆదాయ దేశాల్లోని ప్రజలు 89 శాతం కాలుష్యాన్ని భరిస్తున్నారు. కాలుష్య పీడిత ప్రాంతాల్లో వృద్ధుల బతుకు నరకయాతన అవుతోంది. నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో వాయు కాలుష్యంతో ఏటా 4.2 మిలియన్ల అకాల మరణాలు సంభవిస్తు న్నాయని 2019లో చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. హృదయ, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ లకు కారణమయ్యే కాలుష్య సూక్ష్మకణాల బారిన పడడం వల్లనే ఈ మరణాలు సంభవిస్తున్నాయని అధ్యయనాల్లో నిర్ధారణ అయింది. 60 ఏళ్లు దాటిన వారిలో కాలుష్యం వల్ల వారి దైనందిన జీవన కార్యకలాపాలు సాగడం లేదని ఒక కొత్త అధ్యయనం వెల్లడించింది. అమెరికాలో సుమారు ఎనిమిది సంవత్సరాల పాటు సగటున 15,411 మందిపై నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయి. అరవై ఏళ్లు పైబడిన వారిలో కనీసం 48 శాతం మంది కాలుష్యానికి గురి కావడం వల్ల రోజువారీ కార్యకలాపాలను నిర్వహించ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తేలింది. వాయు కాలుష్య ప్రభావాన్ని పరిశీలిస్తే పర్టిక్యులేట్ మ్యాటర్ (పిఎం2.5, మరియు పిఎం 102.5) తోపాటు నైట్రొజన్ డయాక్సైడ్ (ఎన్ఒ2) అధిక సాంద్రతలు వృద్ధుల దైనందిన కార్యకలాపాలకు తీవ్ర రిస్కు కలిగించేవిగా ప్రభావం చూపిస్తున్నాయి. వాయు కాలుష్యం వల్ల వచ్చే ఇబ్బందులను వృద్ధుల్లో చాలా మంది అంతగా పట్టించుకోవడం లేదు. పిఎం2.5, పిఎం 10, నైట్రొజన్ డయాక్సైడ్ వంటి వాయు కాలుష్య రేణువులను పీల్చడం వల్ల ఊపిరితిత్తుల్లో మంటపుట్టి ఆక్సీకరణ ఒత్తిడికి దారి తీస్తుంది. శరీర కండరాలు నీరసపడి పోతాయి. శ్వాసకోశ వ్యవస్థ మాత్రమే కాదు, శరీర వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. 65 ఏళ్ల కన్నా ఎక్కువ వయసు ఉన్న వారు అవయవ పనితీరులో, రోగ నిరోధక స్థితిస్థాపకతలో సహజమైన క్షీణతను అనుభవిస్తున్నారు. ఈ వయసు వారు గుండె జబ్బు లు, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, మధుమేహం వంటి వ్యాధుల పీడితులై గడుపుతున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిర్వహించిన లాంగిట్యూడినల్ ఏజింగ్‌స్టడీ ఆఫ్ ఇండియా 2021 నివేదిక భారత దేశం లోని వృద్ధాప్య జనాభా ఎదుర్కొంటున్న పరిస్థితులు బయటపెట్టింది. ఈ నివేదిక ప్రకారం 75 శాతం మంది వృద్ధులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు.. ఇంకా 24 శాతం మంది డైలీ లివింగ్ కార్యకలాపాల్లో (ఏడిఎల్ ) కనీసం ఒక పరిమితిని కలిగి ఉన్నారు. 48 శాతం మందికి తమ దైనందిన వ్యవహారాల్లో ఎవరో ఒకరి సహాయం కావలసి వస్తోంది. కుటుంబాల ఆసరా లేక ప్రతి ముగ్గురిలో ఒకరు కుంగుబాటుకు గురవుతున్నారు. 32 శాతం మంది అసంతృప్తి జీవితాన్ని గడుపుతున్నారు. సామాజిక రక్షణకు సంబంధించి 18 శాతం మంది వృద్ధులకు మాత్రమే ఆరోగ్య బీమా ఉంటోంది, 28 శాతం మంది వృద్ధులకు రాయితీల గురించి తెలిసినా, 70 శాతం మంది వృద్ధులు రోజువారీ అవసరాల కోసం ఇతరులపై ఆధార పడుతున్నారు. 78 శాతం మంది ఎలాంటి పెన్షన్ సౌకర్యం లేకుండా జీవిస్తున్నారు.

ఈ నేపథ్యంలో దేశంలో వృద్ధుల సంరక్షణ సేవలు అందించే ఎల్డర్ కేర్ స్టార్టప్ (అంకుర పరిశ్రమ)లు తెరమీదికి వస్తున్నాయి. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి ఎదురైన తరువాత వృద్ధుల సంరక్షణ ఆయా కుటుంబాలకు ఒక సమస్యగా తయారైంది. అందువల్ల వృద్ధుల సంరక్షణ కేంద్రాలను ఆశ్రయించడం తప్పనిసరి అవుతోంది. ఈ సంరక్షణ కేంద్రాలన్నీ కేవలం సేవా సంస్థల్లా కాకుండా ఎంతో కొంత నగదు చెల్లింపుల ఆధారంగా పనిచేస్తుంటాయి. అయితే పేదలైన వృద్ధులకు ఈ ఎల్డర్ కేర్ స్టార్టప్‌ల నుంచి సాయం పొందడం సాధ్యం కాదు. ఎందుకంటే ఇవి ఒక విధంగా వాణిజ్యపరమైన సంస్థలు అయినందున ప్రతినెలా వారు ఛార్జీ చేసిన మేరకు డబ్బు వెచ్చించ వలసి వస్తుంది. ఆర్థికంగా స్థితిమంతులైన కుటుంబాలలో వృద్ధులను సంరక్షిం చడానికి ప్రయివేట్ రంగంలో అనేక స్టార్టప్(అంకుర పరిశ్రమ)లు ఉన్నాయి. పేషెంట్ కేర్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్‌వరకు సకల సౌకర్యాలు సమర్థవంతంగా ఇవి అందజేయగలుగుతాయి. వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండి వృద్ధుల ఆరోగ్య భద్రతను నిర్వహిస్తుంటారు. పాశ్చాత్య దేశాల్లో ఒంటరి వారైన వృద్ధులకు ఈ స్టార్టప్ కేర్ సెంటర్ల ద్వారా సంరక్షణ అందించాలంటే నెలకు రూ.90,000 వరకు ఖర్చు చేయవలసి వస్తుంది. అలాగే వృద్ధులైన తల్లిదండ్రులకు సంరక్షణ కోసం నెలకు రూ.2 లక్షల వరకు భరించవలసి వస్తుంది. రానున్న 30 ఏళ్ల లో ఈ ఖర్చు అమాంతంగా పెరిగే అవకాశం ఉంది. మనదేశంలో వృద్ధుల సంరక్షణ కేంద్రాలు సేవా దృక్పథంతో నామమాత్రం గా నెలకు రూ.15,000 నుంచి 25,000 వరకు ఛార్జి చేస్తున్నాయి. అయినా ఆమేరకు కూడా చెల్లించలేని నిరుపేద వృద్ధులు దేశంలో చాలా మంది ఉన్నారు. సగటు భారతీయులకు ఈ సేవల ఖర్చు తగ్గించాలనుకోవడం ఒక సవాలే. వృద్ధుల సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురాడానికి ఆర్థిక అడ్డంకులను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

# జమిలి చిక్కుముడులు అన్నీ ఇన్నీ కావు

జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే బిల్లులనే ప్రభుత్వం తీసుకొస్తున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలపై తరువాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక




సంస్థల ఎన్నికల విషయం ప్రస్తుతానికి పక్కనపెట్టి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాల ఆమోదం తెలపవలసిన అవసరం లేదని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50 శాతం రాష్ట్రాలు ఆమోదించవలసి వస్తుంది.

ఈ జమిలి ఎన్నికలకు దేశంలో 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీని వల్ల స్థానిక, ప్రాంతీయ అంశాలు పక్కకు పోయి జాతీయ అంశాలదే పైచేయి అవుతుందని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎవరెంత మొత్తుకున్నా ప్రధాని మోడీ పట్టించుకోలేదు. జమిలి ఎన్నికల ఆలోచన వెనుక ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 2015నాటి ఓ సర్వే ప్రకారం ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 77 శాతం ఓటర్లు రెండింటా ఒకే పార్టీకి ఓటు వేస్తారని తేలింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే బిజెపి నేతలు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నారని ఒక అంచనా. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కారుకై తహతహలాడుతున్న బిజెపి ఓటర్ల తాలూకు ఈ ఏకకాలపు ఎన్నికల మనస్తత్వం కలిసొస్తుందని బిజెపి ఆశపడుతోంది. నిజానికి ఏకకాలంలో ఎన్నికలు అనేవి మన దేశానికి కొత్తేమీ కావు. 1951–52లో మొదటి జనరల్ ఎలక్షన్ల నుంచి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతుండేవి.

అయితే కాలవ్యవధి పూర్తికాకుండానే రాష్ట్ర అసెంబ్లీలు రద్దవడం ఎప్పుడైతే మొదలైందో, అప్పుడు 1967 తర్వాత నుంచి ఎన్నికల కథ మారిపోయింది. 2020 నవంబర్ 26 న జరిగిన అఖిల భారత సభాధ్యక్షుల సమావేశంలోనూ ప్రధాని మోడీ జమిలి ఎన్నికల అమలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. లోక్‌సభకు, విధాన సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రభుత్వానికి ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుందని, ఎన్నికల ఆంక్షలు పదేపదే అడ్డుతగలకుండా అభివృద్ధి పథకాలను సజావుగా అమలు చేయడానికి వీలవుతుందని అభిప్రాయం వెలిబుచ్చారు. ఎన్నికల నియమావళి అమలుతో ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయన్నది వాస్తవమే అయినా ఈ సమస్యను పరిష్కరించడానికి జమిలి ఎన్నికలే శరణ్యం అనుకోవడం సమంజసం కాదని రాజ్యాంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల బట్టి శాసనసభల్లో అధికార పక్షాలు అధికారంలో ఉండే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. శాసనసభ్యుల ఫిరాయింపుల వల్ల అవి మెజారిటీ కోల్పోయి, కూలిపోయే అవకాశాలే ఎక్కువగా తటస్థపడుతున్నాయి. ఏ ఒక్కపార్టీ తగిన మెజారిటీతో ప్రభుత్వాన్ని నెలకొల్పే అవకాశం లేనప్పుడు కొద్ది కాలం రాష్ట్రపతి పాలన విధించినా, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అవుతుంది. అంతేకాదు ఒక్కో రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం ఒక్కోసారి ముగింపుకి చేరుకుంటుంది. అలాంటప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగేవరకు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి కొనసాగించడం ప్రజాస్వామిక ప్రక్రియకు తీవ్ర విఘాతం కలుగుతుందని రాజ్యాంగ నిపుణులు చెబుతు న్నారు. అయితే ఈమేరకు రాజ్యాంగ సవరణలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుత రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాజ్యాంగం 83వ ఆర్టికల్ రాజ్యసభ పూర్తిగా రద్దు కావడమనేది లేకుండా చూస్తుంది. రాజ్యాంగ 85 వ అధికరణ పార్లమెంటను సమావేశ పర్చడం, సమావేశాలను ముగించడానికి సంబంధించినది. ఏడాదిలో కనీసం రెండు సార్లయినా పార్లమెంట్‌ను సమావేశపర్చాలని ఈ అధికరణ చెబుతోంది. అంటే ప్రతి రెండు సమావేశాల మధ్య వ్యవధి ఆరు మాసాలకు మించరాదు. ఆర్టికల్ 172 ఎమ్మెల్యేల పొడిగింపునకు సంబంధించింది. ఆర్టికల్ 175 రాష్ట్ర శాసన సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం, వాటికి సందేశాలను పంపించడాన్ని నిర్దేశిస్తురది. 356 అధికరణ రాష్ట్రాల్లో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని నివారించడంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనప్పుడు కేంద్రం జోక్యం చేసుకుని అక్కడి పరిస్థితులను చక్కదిద్దడానికి వీలు కల్పిస్తుంది. అప్పుడు ఈ అన్ని అధికరణాలను తగు రీతిలో సవరిస్తే కానీ జమిలి ఎన్నికలు అమలు చేయడం సాధ్యం కాదు. ప్రపంచంలో జమిలి ఎన్నికల సంప్రదాయం

బెల్జియం, స్వీడన్, దక్షిణాఫ్రికాలో ఉంది. ఏదేమైనా ఈ జమిలి ఎన్నికల నిర్వహణ ఎన్నో చిక్కులు, సవాళ్లతో ముడిపడి ఉందన్నది వాస్తవం.

# అడ్వకేట్ల గౌరవం కాపాడాలి!

2019–20లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు ఐదు సంవత్సరాల కాలపరిమితికి జారీ చేశారు. అవి తయారు చేసి ఇచ్చేసరికి 2022 వచ్చేసింది. 2020, 2021లలో కరోనా వల్ల కోర్టులు జరగలేదు. అయినా 2025 జనవరి 1కి సర్టిఫికెట్ల కాల వ్యవధి ముగిసినందున మరల ఐదేళ్లకి రెన్యువల్, కొత్తగా ఐదు సంవత్సరాల ప్రాక్టీస్ ముగిసినవారు వెరిఫికేషన్ చేయించుకోవాలని బార్ కౌన్సిల్ సర్క్యులర్ ఇచ్చింది. దాని ప్రకారం డిసెంబర్ 21లోగా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పంపించుకోవాలి. 2019–2020లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పెట్టమని అన్నప్పుడు, డిగ్రీ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని, ఫేక్ సర్టిఫికెట్లు ఉన్నవారిని తొలగించాలన్నది ఉద్దేశ్యమని చెప్పారు. కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు కనుగొన్నట్లు ప్రకటించారు. అయితే సకాలంలో అప్లికేషను పెట్టుకోలేని వారు, కొన్ని కారణాల వల్ల డిగ్రీ సర్టిఫికెట్లు దగ్గర లేని వారు సర్టిఫికెట్లు పొందలేకపోయారు. వారిలో చాలా మంది సక్రమంగా బిఎల్/ఎల్ఎల్‌బి చదివి డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారున్నారు. వీరంతా గౌరవప్రదంగా అడ్వకేట్ అనే స్టేటస్ ఉంచుకోవాలి అనుకున్నవారే. అలాగే కొంతమంది ఆడవాళ్ళు కుటుంబ బాధ్యతల వలన ఏక్టివ్ ప్రాక్టీస్ చేయలేకపోయినా, తమ అడ్వకేట్ హోదా ఉంచుకుని, తెలిసిన వారికి సలహాలు ఇస్తూ గౌరవం పొందుతున్నారు... ఇలాంటి వారు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పొందలేకపోయారు.

ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రెన్యువల్ అప్లికేషన్లు పెట్టమని ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం అడ్వకేట్ ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా చూపించడానికి 5 వకాల్తాలు, 5 మెమో ఆఫ్ అప్పియరెన్స్‌లు, డ్రాఫ్టింగ్ డీడ్స్‌కు సంబంధించిన ఆధారాలు పెట్టాలి. లేదా కోర్టు వెబ్‌సైట్ లేదా కాజు లిస్టులో న్యాయవాది పేరు ఉంటే వాటిని, లేదా తీర్పు/ఆర్డరు కాపీలలో న్యాయవాది పేరు ఉంటే వాటిని జతపరచాలి. ఈ ఆధారాలు జత చేయకపోతే బార్ కౌన్సిల్ లిస్టు నుంచి సదరు అడ్వకేట్ పేరును తొలగిస్తారు. వారు ప్రాక్టీస్ చేయడానికి, ఓటింగులో పాల్గొనడానికి అర్హత కోల్పోతారు. ఈ నిబంధనలు అడ్వకేట్లకు సమస్యగా మారుతున్నాయి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ప్రాక్టీస్ చేస్తున్న వారినే ఓటర్లుగా నమోదు చెయ్యాలని, బార్ కౌన్సిల్ సభ్యులుగా ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్లకే అవకాశం కల్పించాలి అనుకోవడం కొంత సబబే. కానీ ఎన్నికలకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్‌కు ముడిపెట్టడం సరైనది కాదు.

అడ్వకేట్ చట్టం, బార్ కౌన్సిల్ రూల్స్ ప్రకారం న్యాయ డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరూ అడ్వకేట్లుగా ప్రాక్టీస్ చేయడానికి అర్హులు. కానీ ఈ నిబంధనల వల్ల కొందరు అడ్వకేట్లకు సమస్య వస్తోంది. కొంతమంది అడ్వకేట్లు ఛాంబర్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. వారి సలహాలు, డ్రాఫ్టింగ్ కక్షిదారులకు, సహ న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరం. వారు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయకపోయినా అడ్వకేటుగా గౌరవం పొందుతుంటారు. మరికొంత మంది అడ్వకేట్లు తమ సీనియర్ల దగ్గర పనిచేస్తూ ఉంటారు. సాధారణంగా సీనియరు మాత్రమే కోర్టులో వకాల్తా వేస్తారు. జూనియర్ అడ్వకేట్ వకాల్తానామాపై సీనియర్‌తో పాటు సంతకం చెయ్యకపోయినా, సీనియర్ తరపున కేసు విచారణ చేసే విధానం అమలులో ఉంది. కొన్ని కారణాల వల్ల జూనియర్ అడ్వకేట్లతో వకాల్తా సంతకం చేయించరు.

కోర్టుల్లో వకాల్తా వేసి కేసులు వాదించడమే కాదు, తాము న్యాయ డిగ్రీ పొందిన జ్ఞానంతో నలుగురికి అవసరమైన న్యాయ సలహాలు ఇవ్వడం కూడా అడ్వకేట్లకు గౌరవం. అందుకు అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్, గుర్తింపు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఈ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ నిబంధనల వల్ల వారందరూ అడ్వకేట్ గుర్తింపునకు దూరమవుతున్నారు.

డాక్టర్లు, ఇంజనీర్లు, ఆడిటర్లు... తమ అసోసియేషన్లలో సభ్యులకు ఇటువంటి నిబంధనలు పెట్టలేదు. డాక్టర్లు వైద్యం చేయకపోయినా, ఇంజనీర్లు ఏ ప్రాజెక్టులలో పనిచేయక పోయినా, ఆడిటర్లు ఆడిట్లు చేయకపోయినా, వారందరినీ అసోసియేషన్లలో సభ్యులుగా ఉండనిస్తున్నారు. అటువంటప్పుడు అడ్వకేట్లకే ఈ ప్రాక్టీస్ నిబంధనలు ఎందుకు రూపొందించారో తెలియదు. ఇది ఎవరి ఆలోచన అయినా ఆమోదయోగ్యంగా లేదు.

అడ్వకేట్లు, వారి సంఘాలు, బార్ అసోసియేషన్లు దీని గురించి సరైన ఆలోచన చేయాలి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఓటర్లుగా పాల్గొనడానికి వేరే పద్ధతులలో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టవచ్చు. అంతేకానీ బార్ కౌన్సిల్ ఎన్నికల ఓటర్ల జాబితాకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్‌కు ముడి పెట్టడం సరికాదు. అడ్వకేట్ అనేది ఒక గౌరవం. ప్రాక్టీస్ చేసినా, చేయకపోయినా, అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ కావడం న్యాయ డిగ్రీ పొందిన వారి హక్కు, గౌరవం. ఆ గౌరవాన్ని కాపాడండి.



## ఉప్పరిగూడలో వ్యవసాయ సమావేశ మందిరంను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వెలుతురు, అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 14:**
రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం నియోజకవర్గం,అబ్దుల్లా పూర్ మెట్ మండలం లోని ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సమావేశం మందిరం ను శనివారం నాడు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు,ఈ ప్రారంభోత్సవం కార్యక్రమంలో రంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. రైతు రుణ మాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దని రంగారెడ్డి అన్నారు, వచ్చే సంక్రాంతి నాటికి రైతులకు రైతు బరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కోసం ప్రభుత్వం అనేక అందిస్తున్న కార్యక్రమాలను అమలు చేస్తూ నేడు రైతు పండుగ జరుపుకోతున్నారు, ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, చిలుక మధు సూధన్ రెడ్డి. పండుగల జయశ్రీ, మల్ రెడ్డి అనురాధ రెడ్డి,మార్కెట్ కమిటి చైర్మన్లు, మున్సిపల్చైర్మన్లు, కౌన్సిలర్స్..సింగల్విండోచైర్మన్.డెరెక్టర్లు,రైతులు. కాంగ్రేస్ పార్టీ నాయకులు. సింగల్ విండో సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నల్లకంచె బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

**వెలుతురు, రంగారెడ్డిజిల్లా, డిసెంబర్ 14:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ వసతి గృహాలు మరియు గురుకులాలలో డైట్ ఛార్జీలు పెంచడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నాడు ఇబ్రహీం పట్నం నియోజకవర్గం పరిధిలోని నల్లకంచె బాలికల వసతి గృహాన్ని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సందర్శించి పెంచిన డైట్ ఛార్జీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహంపక్తి భోజనం చేశారు,ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎఎస్ అధికారి శశాంక్ గోయల్ ,డీసీసీబి చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు.గడ్డి అన్నారం వ్యవసాయ



మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.అదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి.స్థానిక కౌన్సిలర్ భర్తకి జగన్.ఎంఆర్ ఓ సునీత..ఎంఈఓ హీర్య నాయక్ ,ప్రిన్సిపాల్ లీలావతి తో పాటు స్థానిక నాయకులు. తల్లి తండ్రులు ,విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అయ్యప్ప పడిపూజలో జక్క వెంకట్ రెడ్డి

**ఉప్పల్, వెలుతురు:** ఉప్పల్ లోని కేకేఆర్ గార్డెన్‌లో హరహరపుత్రుడు అయ్యప్ప స్వామి వారి 18వ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.. బట్టు నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమానికి పీర్జాదిగూడ బీఆర్ఎస్ నాయకులు జక్క



వెంకట్ రెడ్డి ముఖ్య అతిదులుగా హాజరై స్వామి వారి పూజలో పాల్గొన్నారు.. పడి వెలిగించిన అనంతరం తీర్ద ప్రసాదాలు తీసుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు లేతాకుల రఘుపతి రెడ్డి, జావీద్ ఖాన్ తదితరులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## బీటీ రోడ్లకు శంకుస్థాపన

**మేడిపల్లి, వెలుతురు:**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.. ఈ కార్యక్రమానికి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పనులను ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 లక్షల నిధులతో బిటి రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, కొత్త రవి గౌడ్, కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కోఆప్షన్ మెంబెర్ రంగా బ్రహ్మన్న గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



### సహకార బ్యాంకుల బలోపేతం కోసం
# ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలి

- ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తా
- తెలంగాణ సహకార సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కా ర్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు..




**వెలుతురు, కాచిగూడ:**
వ్యవసాయ రంగానికి, రైతుకు, ప్ర భుత్వానికి వారధిగా ఉన్న సహ కార బ్యాంకుల బలోపేతం కోసం ప్ర భుత్వం తగిన నిర్ణయాలు తీసుకో వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎ మ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. కాచిగూడలోని మ్యాడం అంజయ్య భవన్ శనివారం జరిగిన తెలంగాణ సహకార సెంట్రల్ బ్యాం కుల ఉద్యోగుల అసోసియేషన్ (టి సిసిబిఇఎ) 4వరాష్ట్ర మహాసభల కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సహకార బ్యాంకుల వ్యవస్థలో రెండంచెల వ్యవస్థను అమలు చేయాలనే ఉద్యోగుల డిమాండ్ న్యాయమైనదని, దీని వల్ల వ్యవస్థా పరమైన ఖర్చులు, వడ్డీ తగ్గి ప్రధాన లబ్ధిదారులైన రైతులకు మేలు జరుగుతుందని, ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు. వ్యవ సాయరంగానికి, రైతుకు, ప్రభుత్వా నికి వారధులు సహకార బ్యాంకుల ఉద్యోగులని, వారి వేతనాల్లో అస మానతలు తగదని, వారికి కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు చెల్లించి పెన్షన్, హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సహకార బ్యాంకుల ఉద్యో గులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ఇందు కోసం ఉద్యోగులు చేసే పోరా టాలకు సిపిఐ అండగా ఉంటుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టిఎస్కా బ్) అధ్యక్షులు మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ.. గత పదేళ్లలో సహకార వ్యవస్థ నిర్వీర్యమైందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం సహకార బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేసేం దుకు చర్యలు చేపట్టిందన్నారు. దే శానికి వెన్నెముక అయిన రైతును, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు బడి ఉందన్నారు. వ్యవసాయ ప్రాథ మిక సహకార సంఘాలను కూడా అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బి.ఎస్.రాంబాబు అధ్య క్షోపన్యాసం చేస్తూ సహకార బ్యాం కుల పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్షత ధోరణికి వ్యతిరేకంగా, ఉద్యోగుల సర్వీస్ కండీషన్ల మెరుగుదల కోసం పోరాడాలన్నారు. బ్యాంకు లావాదే వీలను మరింతగా పెంచేందుకు ఉ ద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ఇందు కోసం వారు చేసే శ్రమకు తగిన వేత న సవరణ చేయాలని ఆయన బ్యాంకుల యాజమాన్యాన్ని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎఐసిబిఇ ఎఫ్ చైర్మన్ తపన్ కుమార్ బోస్, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్. రవి కుమార్, ఎపిటిబి ఇఎఫ్ అధ్యక్షులు రవీంద్రనాథ్, కరీంనగర్ డిసి సిబి చైర్మన్ కొండూరు రవీందర్ నల్ల గొండ డిసిసిబి చైర్మన్ శ్రీనివాస్, ఎఐ టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, టిసిసిబిఇఎ చైర్మన్ కె. జనార్దన్ రావు, ప్రధాన కార్యద ర్శి పి.నాగేందర్, ఉప ప్రధాన కార్య దర్శులు షేక్ ఏలీముద్దీన్, బి.ప్ర వీణ్, ఎపిసిసిబిఇఎ వైఎస్ చైర్మన్లు కె.టి.రామారావు, వి.రాధాకృష్ణ మూర్తి, టి ప్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఉప ప్రధాన కార్యదర్శి వి.శ్రీ నివాస్, ఏఐబిఈఏ రాష్ట్ర నాయ కులూ పి.వి. కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పారదర్శక పాలన: కేఎల్ఆర్

**వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 14:**
మహేశ్వరం నియోజకవర్గంలో గూడు లేని పేదలు ఉండొద్దని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి అన్నారు. ఇందిరమ్మ కమిటీలతో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు వారధులుగా పని చేస్తారని ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.

ప్రజాపాలనలో ఇచ్చిన అర్జీల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రూ.5లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనుందని కేఎల్ఆర్ తెలిపారు.మహేశ్వరం పట్టణంలో కాకి ఈశ్వర్నివాసంలోకాంగ్రెస్నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇంటి స్థలం ఉన్న విడతల వారిగా సర్కార్ సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు కృషి చేస్తాయని లక్ష్మా రెడ్డి తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను పర్యవేక్షించేందుకు మండలాలు, డివిజన్ల వారిగా 5 నుంచి 8 మందిని స్పెషల్ అబ్జర్వర్లను పార్టీ నాయకులను నియమిస్తున్నట్లు లక్ష్మారెడ్డి తెలిపారు.

ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థిక సహాయం.ఇళ్లు, స్థలం లేని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇస్తామని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో గూడు లేని పేద, మధ్య తరగతి ప్రజలు స్థానిక ఇందిరమ్మ కమిటీలను సందర్శించాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలి

**- కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీనివాస్**






**వెలుతురు, కాచిగూడ:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించి,వాహనాలు నడపా లని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు ప్రమా దాల్లో మరణాలకు హెల్మెట్ లేకపో వడమే ఇందుకు కారణమని ఆయ న స్పష్టం చేశారు. సోమవారం బర్క త్ పుర చౌరస్తా వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. నిబంధనలు అతిక్ర మించిన పలు వురు వాహనదారు లకు సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుం డా వెళ్తున్న ద్విచక్ర వాహ నదారుడి కి కౌన్సిలింగ్ ఇచ్చి, హెల్మెట్ ధరిం చారు. అనంతరం ఇన్స్ స్పెక్టర్ శ్రీని వాస్ మాట్లాడుతూ..హెల్మె ట్ ధరిం చకుండా వాహనాలను నడపటం వల్ల అనేక మంది ప్రమాదాల బారి న పడుతున్నారని, మరికొందరు చనిపోతున్నారని అన్నారు.మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహ నం నడపరాదన్నారు. ద్విచక్ర వాహ నంపై ముగ్గురు వెళ్లరాదని, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద, సిగ్నల్స్‌ల వద్ద నిబం ధనలను అతిక్రమించరాదని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనం నడిపేవారిపై చట్టపరంగా జరి మానాలు విధించను న్నట్లు హెచ్చరించారు. సీటుబెల్టు ధరించి కారు నడపాలని సూచించారు. ఇప్పటివరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్పుడు తలపై హెల్మెట్ ఉన్నా లేకున్నా చూసి చూడనట్టుగా వ్యవహరించిన పోలీసులు ఇకపై కఠినంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అలా గే తనిఖీల సమయంలో హెల్మెట్ ధరించకుండా పట్టుబడిన ప్రతి వా హనదారుడికి జరిమానా విధిస్తా మని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్ గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది నారాయ ణరెడ్డి, సుబ్బారెడ్డి, నగేష్, గంగ రాజు తదితరులు పాల్గొన్నారు.









### విద్యార్థుల సమస్యలు
# తెలుసుకున్న మేయర్

**మేడిపల్లి, వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని పీర్జాదిగూడ నగర పాలకసంస్థ మేయర్ అమర్ సింగ్ ప్రారంభించారు.. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ ఆహ్వానం మేరకు బండి కన్వెన్షన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ మేరకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వారికి కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించారు... తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ పరిసరాలు, శుభ్రతను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్ విద్యార్థులకు అందే సౌకర్యాల ప్రమాణాలు పాటించేలా పఠన శక్తి, సామర్థ్యాలను పెంపొందిం చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు మేయర్..

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, అనంత్ రెడ్డి, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, సాంబిరెడ్డి, భరత్ కుమార్, శశీ మోహన్ గుప్తా, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, స్టాఫ్ మెంబెర్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# డైట్ మెనూ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 14:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని రంజోల్ గ్రామంలోగల సాంఘీక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలలో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా జడ్పీ సిఇఓ జానకీ రెడ్డి తో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుకులంలోని స్టోర్ రూమ్లను, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

ఏటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహాపంక్తి భోజనం చేస్తూ, భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకులంలో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందించడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని, ప్రజా ప్రభుత్వంలో డైట్ చార్జీలు పెంచడం అభినందనీయమని వారన్నారు. రేపటి భావి భారత పౌరులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ఉద్దేశంతోనే విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీడీఓ, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ

### - ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 14 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం కాంగ్టి మండల ఎంపీడీవో కార్యాలయం లో ఈరోజు కాంగ్టి మండల పరిధలోని పలు గ్రామలకు చెందిన మొత్తం కళ్యాణ లక్ష్మి %డ% షాదీ ముబారక్ మొత్తం 37చెక్కులను సీఎంఆర్ఎఫ్ మొత్తం 49 చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన గౌరవ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు పార్టీలకతీతంగా ప్రతి పేదవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని అందిస్తామన్నారు, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాల వరకు కళ్యాణ లక్ష్మి చెక్కులు మరియు షాది ముబారక్ చెక్కులను కాంగ్రెస్ వారు అని తెలిస్తే చాలు వారికి చెక్కులను ఇవ్వకుండా వారికి ఇబ్బందుల కలిగించేవారు,గత బిఆర్ఎస్ నాయకుల లాగా వ్యవహరించకుండా అలా కాకుండా మ ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి వివాహం జరిగిన 5 నెలలు లేదా 6 నెలల లోపు కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు చేసే విధంగా మా ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు ప్రతి ఒక్కరికి మా ఈ ప్రజా ప్రభుత్వంలో పార్టీతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రతి పథకం అందే విధంగా మా ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఉన్నతదికరులు,



ప్రజామరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితర మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.






### మొత్తం 112 కేసులు పరిష్కారం...
### రూ. 1.25.69,897 లు వసూలు..
### మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె. సూరికృష్ణ వెల్లడి..

# జహీరాబాద్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 14:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్ కోర్టు కాంప్లెక్స్ లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో సీనియర్, జూనియర్ విభాగలలో మొత్తం 112 కేసులు పరిష్కారం అయ్యాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె. సూరికృష్ణ పత్రిక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా వారు వెల్లడించిన వివరాల ప్రకారం... సీనియర్ కోర్ట్ విభాగంలో 69 బ్యాంకు పియల్సి కేసులు, ఒక సైబర్ క్రైమ్ కేసు, ఒకటి ఇతర పియల్సి కేసు పరిష్కారం కాగా మొత్తం రూ.1,23,98,307=00 లు వసూలు అయ్యాయని, అలాగే జూనియర్ కోర్టు విభాగంలో 26 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 15 అడ్మిషన్ కేసులు పరిష్కారం కాగా మొత్తం రూ.171500=00లు వసూలు అయ్యాయని తెలిపారు. మొత్తంగా ఈ రోజు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో జూనియర్ మరియు సీనియర్ విభాగలలో మొత్తంగా 112 కేసులు పరిష్కారం కాగా రూ. 1,25,69,897=00 లు వసూలు అయ్యాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె. సూరికృష్ణ వారు వెల్లడించిన ప్రకటనలో తెలిపారు.

# నేటి నుండి విద్యార్థులకు నూతన మెనూ

**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 14:** మండల కేంద్రమైన కొడిపల్లి లోని గిరిజన సంక్షేమ గురుకులంలో ప్రిన్సిపల్ సిహెచ్ ఫణికుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం విద్యార్థులకు నూతన మెనూను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వం హాస్టల్స్ విద్యార్థులకు 40 శాతం మిస్ చార్జీలు పెంచిన సంద ర్భంగా శుక్రవారం నుండి నూతన మెనూ అమలులోకి వస్తుందన్నారు. గతంలో చాలీ చాలని చార్జీలతో విద్యార్థులకు భోజన వసతులు కల్పించడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నా




మన్నారు. పెంచిన మెనూ చార్జీలతో విద్యా ర్థులకు పుష్టికరమైన ఆహారం అందిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ గురుకులాల నుండి ఎంతోమంది ఐఏఎస్లు ఐపీఎస్లు వచ్చారని, విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలను సాధించాలన్నారు. డిప్యూటీ తాసిల్దార్ శ్లోకాలతో పాటలతో విద్యార్థులను ఉత్తేజపరుస్తూ అలరించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లి దండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మంజుల, జూనియర్ వాయిస్ ప్రిన్సిపల్ భవాని ఇపద ఇతర ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 14:** దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రంజోల్ గ్రామంలోగల దత్తాత్రేయ స్వామిని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అంతకు ముందు వారికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద అర్చకులు ఆశీర్వచనం శాలువాతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, న్యాల్కల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.కిరణ్ కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రతాప్ రెడ్డి, మల్లీకార్జున్, గ్రామ అధ్యక్షులు భీమశంకర్, నర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 14 వెలుతురు:** తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి వచ్చిన వారికి అర్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని నరసింహ స్వామిని కోరుకున్నట్లు వారు తెలిపారు.




## హాస్టల్లలో నూతన మెనూను ప్రారంభించిన అధికారులు

**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 14:**
హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిన సందర్భంగా మండల కేంద్రమైన కొల్చారం బీసీ హాస్టల్ లో ఎంపీడీవో కృష్ణవేణి, రంగంపేట ఎస్సీ హాస్టల్లో తహసిల్దార్ గఫర్ మియా లు విద్యార్థులతో కలిసి శుక్రవారం నూతన మెనూ ప్రారంభించారు. అనంతరం




మాట్లాడుతూ విద్యార్థులు హాస్టల్ వసతులను ఉపయోగించుకొని చక్కగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆయా హాస్టల్లో వార్డెన్లు పంచాయతీ సెక్రెటరీ అంజయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులను చెక్కులను అందజేసిన రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 14:** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామానికి చెందిన చాకలి పెంటన్న మరియు డిడిగి గ్రామానికి చెందిన అనిత లకు సిఎం సహాయ నిధుల నుండి





మంజూరైనా చెక్కులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి అందజేశారు. సీఎం నిధుల ద్వారా తమకు చెక్కులను మంజూరు చేయించినందుకు లబ్దిదారులు వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, సిడిసి చైర్మన్మహమ్మద్ అబ్దుల్ ముబీన్, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, మాజీ వైస్ యం.పి.పి.వి.రాములు, మాజీ సోసైటి చైర్మన్ ధనసిరి మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, న్యాల్కల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.కిరణ్ కుమార్ గౌడ్, ఇమామ్ పటేల్, జహంగీర్, మోతిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్సీలో పాస్ అయిన వాళ్లకు నియామకమైన పత్రాలు అందజేత

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 14 :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం లో 2024 డీఎస్సీ లో నియామకమైన నూతన ఉపాధ్యాయులు పట్లోళ్ల విజయలక్ష్మి ఎస్ జి టి ప్రాథమిక పాఠశాల లింగాపూర్, శంకర్రావు ఎస్సే ఈ అంజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతసాగర్ గర్ల కు పి ఆర్ టి యు టి ఎస్ మెంబర్షిప్ చేయించనైనది. పి ఆర్ టి యు టి ఎస్ సంఘం చేస్తున్న కృషిని నూతన ఉపాధ్యాయులకు తెలియజేయునది ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల పి ఆర్ టి యు టి ఎస్ అధ్యక్షులు శివరాం నాయక్, ఉపాధ్యక్షులు దుర్గం పండరి బాబురావు పిఎస్ హెచ్ఎం చందర్ నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కం పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ద్వితీయ బహుమతి అందుకున్న చౌటుప్పల్ గురుకుల విద్యార్థిని

**చౌటుప్పల్ మండలం వెలుతురు డిసెంబర్ 14:** భువనగిరిలో నిర్వహించిన జిల్లా స్థాయి వైద్య విజ్ఞాన ప్రదర్శనలో చౌటుప్పల్ గురుకుల పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని చిలుకూరి ప్రద్యుమ్న జిల్లా ద్వితీయ బహుమతిని అందుకున్నది. శనివారము పాఠశాలలో డైట్ చార్జీల ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ ఆఫీసర్ శుభం నార్గల్ , చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,డీఈఓ సత్యనారాయణ, చౌటుప్పల్ మాజి జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ లోక్ అదాలత్‌లో 320 కేసు పరిష్కారం

**- జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష**

**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 14:** కోర్టు ఆవరణలో జరిగిన నేషనల్ లోక్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష మాట్లాడుతూ భారత దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌తో వివిధ రకాలైన కేసులు బ్యాంకు, బిఎస్ఎన్ఎల్, క్రిమినల్, సివిల్, డ్రంక్ అండ్ డ్రైవ్, ప్రీ



లిటిగేషన్ ,అనేక రకాల కేసుల లోకదాల త్ ద్వారా ప్రజలలో వచ్చే లిటిగేషన్స్ 320 పరిష్కారమయ్యాయని వారు అన్నారు. ఈ సందర్భంగా వచ్చిన క్లైంట్ లకు పండ్ల ను పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతు గౌడ్ లింగయ్య, సత్తయ్య ,మామిడి వెంకటరెడ్డి శ్రవణ్ కుమార్ బర్ల డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, యాదాసు యాదయ్య, రమేష్, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మల్లయ్య , కోర్టు సూపరిండెంట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రంథాలయ జిల్లా చైర్మన్ కలిసిన కాంగ్రెస్ నాయకుడు నరేష్ యాదవ్

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 14:** యాదాద్రి భువనగిరి జిల్లా నూతన గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవాయిస్ ను కలిసిన శుభాకాంక్షలు తెలియజేసిన సంస్థాన్ నారాయణపురం యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు అందె నరేష్ యాదవ్. మండలాలో ఉన్న గ్రంథాలయాలను సందర్శించి పరిశీలించాలని కోరారు.గ్రంథాలయాలలో ఉన్నా సమస్యలు పరిష్కారం చూపుతూ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



# లింగంవారిగూడెంలో మధ్యంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకరరెడ్డి స్వగ్రామం కావడం విశేషం
- కాంట్రాక్టర్‌కు నిధుల మంజూరులో జాప్యం
- నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు
- భవన నిర్మాణం పూర్తి చేయించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కోరుతున్న లింగంవరిగూడెం గ్రామస్థులు




**వెలుతురు, మునుగోడు, డిసెంబర్ 14:** మునుగోడు నియోజకవర్గ,సమస్థాన్ నారాయణ పూర్ మండలం సర్వేల్ గ్రామ శివారు లింగవారి గూడెం లో మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ మధ్యంతరంగా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాలేదని కాంట్రాక్టర్ పాఠశాల నిర్మాణపు పనులను నిలిపివేశారు. పైగా అ పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులుండగా పదిహేను విద్యార్థులు ప్రసుత్తం విద్యాను అభ్యసిస్తున్నారు.లింగం వారి గూడెం గ్రామం నుండి చాలా మంది విద్యార్థులు సమీప గ్రామం సర్వేల్. చౌటుప్పల్ లకు ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. గ్రామంలో కొత్త పాఠశాల భవనం నిర్మాణంలో ఉన్నది,కానీ ఆ కాంట్రాక్టర్‌కు బిల్లులు రాని కారణంగా, పనులు మధ్యంతరంగా నిలిచిపోయి పాఠశాల భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని దుస్థితి నెలకొంది, గ్రామానికి చెందిన కొందరు యువకులు కలిసి నిల్చి పోయిన పాఠశాల భవనం నిర్మాణ పనులను పూర్తి చేయించి పాఠశాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

అందులో భాగంగానే లింగం వారి గూడెం గ్రామ యువకుడు విజయకుమార్ ఎంబీఏ చదివి కూడా తమ స్వగ్రామంపై మక్కువ తో స్థానికంగా వ్యవసాయం,ఇతర వ్యాపారాలు చేసుకుంటూ ఊరిలో నివాసం ఉంటున్న నేపథ్యంలో నిల్చి పోయిన పాఠశాల భవన నిర్మాణానికి త్వరలో గ్రామానికి చెందిన కొంత మంది యువకులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధి కోసం కార్యాచరణ మొదలుపెడుతామని విజయ కుమార్ తెలిపారు, కాగా లింగం వారి గూడెం గ్రామ మునుగోడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకరరెడ్డి స్వగ్రామం కావడం గర్హనీయం. ప్రసుత్తం మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి లింగంవారిగూడెం గ్రామంలోని మధ్యంతరంగా నిలిచిపోయిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాల భవన నిర్మాణం పూర్తి అయితే వచ్చే విద్యా సంవత్సరంలో నైనా పాఠశాల నిర్మాణం అందుబాటులో ఉండేలా చూడాలని తద్వారా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

# పరుష పదజాలంతో దూషించిన రిపోర్టర్‌పై చర్య తీసుకోవాలి






**నల్లగొండ వెలుతురు డిసెంబర్ 14:** సోషల్ మీడియా వేదికగా నకరికల్లు శాసనసభ్యులు వేముల వీరేశమును పరుష పదజాలంతో దూషించిన ఐ న్యూస్ రిపోర్టర్ కిరణ్ వరకాంతం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఎస్పీ పవార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం ఎస్ పి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాచర్ల సైదులు మాదిగ, జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ మాట్లాడుతూ జర్నలిజం ముసుగులో కనీసం ఇంగిత జ్ఞానం లేకుండా శాసనసభ్యులు అనే గౌరవం లేకుండా ఇష్టానుసారంగా దూషించడం తగదన్నారు. ఒక వర్గాన్ని నెత్తినెత్తుకోవడం , మరో వర్గాన్ని కించపరిచడం జర్నలిజం అయితే దానికి మాదిగ సమాజం కచ్చితంగా చికిత్స చేస్తుందని విమర్శించారు. కేవలం కులాహంకారంతోనే ఇలాంటి పదజాలం వాడుతున్నారని వారు విమర్శించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం కు, మాదిగ సమాజానికి ఐ న్యూస్ రిపోర్టర్ కిరణ్ వరకాంతం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు పోలీస్ శాఖ తీసుకునే వరకు ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్, పెరిక ఉమామహేశ్వర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తుల సమ్మె , చింతా శివశంకర్, కందుల మోహన్, ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కొంపల్లి రమేష్ కత్తుల తులసీదాస్, ఎస్ సి సెల్ జిల్లా చైర్మన్ బోడ స్వామి, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రూప , మారపాక నరేందర్ , కుడతాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలి

**- జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 14:** సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఐదు రోజులుగా వారు నిరవధిక సమ్మె చేస్తున్నారని విద్యాశాఖలోని సమగ్ర శిక్ష మన రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు.ఈ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ ,కార్మికులను రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, మరియు రాత పరీక్ష ద్వారా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీచే ఇంటర్వ్యూలలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి వివిధ స్థాయిలలో విధులు నిర్వహిస్తున్నారు. గత 18 సంవత్సరాల నుండి సర్వ శిక్ష ఉద్యోగులు పాఠశాల విద్య అభివృద్ధి కోసం వారి నైపుణ్యాన్ని మరియు కృషిని అందిస్తున్నారు. వీరిలో చాలామంది ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబానికి చెందినవారు.వీరి యొక్క స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే వారి సమస్యల పరిష్కారం కొరకు సమ్మె చేస్తున్న వారిని తక్షణం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని జాజుల పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ గొడుగు మహేష్ యాదవ్, విద్యార్థి సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర కిరణ్ గౌడ్ ,బీసీ విద్యార్థి సంఘం స్టేట్ కోఆర్డినేటర్ కొప్పుల చందు గౌడ్, ఎల్బీనగర్ యువజన సంఘం అధ్యక్షుడు స్వామి కుమార్, బీసీ విద్యార్థి సంఘం గ్రేట్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ అనంతుల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఉద్యోగాలకు సంస్థాన్ యువకుడి ఎంపిక

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్ 14:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని సాధా రణ రైతు పోలామోనీ గోపాల్ ధనమ్మల కుమారుడు సాయి (22) ఇటీవల విడుదల చేసిన ఎస్.ఎస్.సి జీడీ రిక్రూట్‌మెంట్‌లో సి.ఆర్.పి.ఎఫ్ విభాగంలో ఉద్యోగాన్ని సాధించాడు.అతడు 2019లో 10వ తరగతి స్థానిక నారాయణపూరం మండల కేంద్రంలో జెడ్.పి.ఎచ్.ఎస్ పాఠశాలో లో పూర్తి చేశాడు. అతడి తల్లిదండ్రులు పొలమోని గోపాల్ ధనమ్మలు చాల సంతోషం వక్తం చేశారు.ప్రస్తుతం పీ.జీ చదువును కొనసాగిస్తు ప్రభుత్వ ఉద్యోగాలకి ప్రయత్నం చేసిన మొదటి సారే ఉద్యోగాన్ని సాధించినదుకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



# పిల్లలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి

**ఇబ్బందులు ఎదురైతే ఉపాధ్యాయులదే బాధ్యత.**

**సర్వేలు గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు**

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్ 14 :** సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్



గురుకుల పాఠశాలను యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగదులను శౌచాలయాలను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీల ప్రోగ్రాం ని ప్రారంభించారు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని అన్నారు . మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఎమ్మార్వో కృష్ణ,ఎంపీడీవో నరసింహా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షులుగా పసుల శ్రవణ్, కార్యదర్శిగా తొర్తి శ్రీనివాస్..**





**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 14:** భారత్ మజ్దూర్ సంఘ్ కరీంనగర్ జిల్లా నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు.. శనివారం రోజున బిఎమ్ఎస్ కరీంనగర్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా లో అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య అధికంగా ఉంటుందని, ప్రతి కార్మికునికి బిఎంఎస్ నాయకులు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ప్రస్తుత జిల్లా కార్యవర్గం ను రద్దు చేస్తూ, నూతన కార్యవర్గం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాఅధ్యక్షులు పసుల శ్రవణ్ ,ఉపాధ్యక్షులుగా నోముల ప్రసాద్ ,గోవిందుల సతీష్ నక్క అరుణ్ కుమార్, ఎం రమణయ్య , జిల్లా కార్యదర్శి గా తొర్తి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగారామాంజనేయులు దేవరనేని మహేందర్ రావు, తాటికొండ తిరుపతి ,కర్ణకంటి సత్యం ,కోశాధికారి పోతరవేణ కుమార్ యాదవ్ ,కార్యాలయ కార్యదర్శి మాడిశెట్టి సునీల్ సభ్యులు గా టి శివ రామ కృష్ణ, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ లతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుధీర్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, బీడీ మజ్దూర్ మహా సంఘ్ రాష్ట్ర కార్యదర్శి సిపివేరు కిష్టయ్య, బీడీ మజ్దూర్ మహా సంఘ్ జిల్లా కార్యదర్శి రేణికుంట శంకర్, కంది కొండాల్ రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట బీసీ సంక్షేమ శాఖ అధికారిణి అనసూయను సస్పెండ్ చేయాలి

**- జాజుల లింగంగౌడ్**



హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 14: బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనసూయ పై చర్య తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బీసీ బాలికల వసతి గృహంలో పారా మెడికల్ మొదటి సంవత్సరం చదువుతున్నటు వంటి సంధ్య ను హాస్టల్ నీ సందర్శించడానికి వచ్చినటువంటి అధికారి నీకు క్రమశిక్షణ లేదు నాకు నమస్కారం పెట్టవ నేను ఒక జిల్లా అధికారిని అంటూ విద్యార్థిని జుట్టు పట్టుకొని ముఖంపై విచక్షణా రహితంగా విద్యార్థులపై దాడి చేసింది అందరు విద్యార్థుల భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థి వైద్యం కోసం ప్రభుత్వ హాస్పిటల్ కు తరలి వెళ్ళింది జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి అధికారిపై విచారణ చేసి తక్షణమే సస్పెండ్ చేయాలి

## చౌటుప్పల్ గురుకులంలో సహ పంక్తి భోజనాలు చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

వెలుతురు, చౌటుప్పల్, డిసెంబర్ 14:
మన పిల్లల్ని మనం ఇంట్లో ఎలా చూసుకుంటామో హాస్టల్లో ఉండే పిల్లల్ని సిబ్బంది అలాగే చూసుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మెస్ చార్జీల పెంపు అనేది ఎప్పటినుండో ఉన్న డిమాండ్ అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నెరవేర్చిందన్నారు, శనివారం మునుగోడు నియోజకవర్గం, చౌటుప్పల్ లోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని



గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండ్ ఎన్. శుభం ప్రకాష్ ఐపిఎస్ తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి హాస్టల్లో సహ పంక్తి భోజనం చేశారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు ,

## శ్రీకాంత్ గౌడ్‌ను సన్మానించిన గౌడ సంఘం నాయకులు

వెలుతురు, యాదాద్రి భువనగిరి జిల్లా, డిసెంబర్ 14:
యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన తూర్పునూరి శ్రీకాంత్ గౌడ్ ను శనివారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మాననించారు, కాగా శ్రీకాంత్ గౌడ్ అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ



అభివృద్ధి కోసం కృషి చేశారు,మునుగోడు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ గా పని చేశారు, ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గా ఎన్నికైన సందర్భంగా ఆయన ను యాదాద్రి భువనగిరి జిల్లా గౌడ సంఘం నాయకులు సుర్వి మల్లేష్ గౌడ్, కొండ గిరి గౌడ్. ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్లోని సిబ్బంది విద్యార్థులను తమ పిల్లలా చూసుకోవాలి

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

చౌటుప్పల్ మండలం వెలుతురు డిసెంబర్ 14:
మన ఇంట్లో పిల్లల్ని మనం ఎలా చూసుకుంటామో హాస్టల్లో ఉండే విద్యార్థులను సిబ్బంది అలాగే చూసుకోవాలి .మెస్ చార్జీల పెంపు అనేది ఎప్పటినుండో ఉన్న డిమాండ్ దానిని



కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది అని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు.

మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మండల కేంద్రం లోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచి సందర్భంగా నిర్వహించన ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండ్ ఎన్. శుభం ప్రకాష్ ఐ.పి.ఎస్, వెన్ రెడ్డి రాజు,డీ.ఈ.ఓ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి హాస్టల్లో భోజనం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**

**స్థానిక పోరులో కాంగ్రెస్ జెండా ఎగరాలి**

**కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి**



పాలకుర్తి,(వెలుతురు న్యూస్):
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాతాపురం, తొర్రూరు, ఈరవెన్ను గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో గ్రామాల సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తుందని అన్నారు. ఆరోగ్యారెంటీలను అమలు చేసి దేశానికే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో లక్షలాదిమంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గృహ అవసరాలకు విద్యుత్ భారం పడకూడదనే సంకల్పంతో 200 యూనిట్ల ఉచిత విద్యుత్కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐదు లక్షలు ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. గత ప్రభుత్వం నామమాత్రంగా రుణమాఫీ చేసి రైతులను మోసం చేసిందని, రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని, గత ప్రభుత్వం సాగునీరు అందించే కాలువలను పట్టించుకోకపోవడంతో రైతులకు సరైన సమయంలో సాగునీరు అందలేదని, కాలువల మరమ్మతులకు ఏనాడు పట్టించుకోలేదని తెలిపారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించాలనే సంకల్పంతో సొంత ఖర్చులతో కాలువలను మరమ్మతులు చేసి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి పూడికను తొలగించామని తెలిపారు. ఉప కాలువలను మరమ్మతులు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేస్తున్న కృషి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, గడపగడపకు ప్రచారం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి, రాబోవు స్థానిక పోరులో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జీర్ణించుకోలేకనే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని, ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, తొర్రూరు సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డి, ఆయా గ్రామాల అధ్యక్షులు కసిరబోయిన కృష్ణమూర్తి, చిలువేరు బాలరాజు, బిర్రు సోమేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి, దేవస్థాన మాజీ డైరెక్టర్ లోనే శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మారుజోడు సంతోష్, మార్కెట్ డైరెక్టర్లు గోనే అశోక్ రెడ్డి, పసులాది యాకయ్య, నాయకులు గోనె కార్తీక్ రెడ్డి, ఏలూరి యాకన్న, చిలువేరు సంపత్, బొందుగుల కొండయ్య, అనుముల మధుకర్ రెడ్డి, లతోపాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సోనియాజీ... మీ సమ్మతితోనే బతుకమ్మను అవమానిస్తున్నారా?

**- ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి**

**- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**- రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం**




హైదరాబాద్,(వెలుతురు న్యూస్):
మహిళలు జరుపుకునే బతుకమ్మను ముఖ్యమంత్రి అవమానించిన విషయం తెలిసిందా లేదా ? లేదంటే మీ సమ్మితితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజాన్ని అవమానిస్తున్నారా అన్నది తెలంగాణ సమాజానికి చెప్పాలని సోనియా గాంధీని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు

ప్రియాంకా గాంధీ కేరళ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు కాబట్టి అక్కడి చీర కట్టుకొని పార్లమెంటులో మాట్లాడారని, మరి తెలంగాణ సీఎం బతుకమ్మను అవమానం చేస్తూ తెలంగాణ తల్లి చేతుల్లోని బతుకమ్మను మాయం చేశారని, దీనికి మద్దతిస్తున్నారా అని ప్రియాంకా గాంధీని ప్రశ్నించారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వచ్చి గ్యారెంటీ కార్డులపై సంతకాలు చేసి తెలంగాణ ప్రజలను గౌరవిస్తామని చెబితే ప్రజలు నమ్మి కాంగ్రెస్ కు ఓట్లు చేశారని అన్నారు.

బీసీ వర్గాలకు చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా, కూడా బహుజనులను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అని అనని వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆత్మ లేదని, ఆయన ఉద్యమంలో లేరు కాబట్టి తెలంగాణ హృదయం అర్థమవ్వడం లేదని చెప్పారు.

తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంపై రేవంత్ రెడ్డి ఎక్కడా లేరు. తెలంగాణ పునర్నిర్మాణ సమయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారు. ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్లుంటుంది. అందరం కలిస్తేనే ఒక అందమైన బతుకమ్మ అవుతుంది... అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ. అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుంది ?మన అస్తిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదు.

# కంట్రోల్‌రూం సేవలను ప్రారంభించిన జీహెచ్ఎంసీ

**నగరంలో నిర్లక్ష్యంగా సమగ్ర ఇంటింటి సర్వే**

హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా కాలనీల్లో జరగలేదు. అంతలోనే ప్రభుత్వం నగరంలో కుటుంబ సర్వే ముగిసినట్లుగా ప్రకటించడంతో ఆయా కాలనీవాసులు ఆందోళన చెందారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెల్లడంతో గ్రేటర్ నగర వాసుల కోసం కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్)ను ఆదేశించింది. ఈ మేరకు కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలనుకునే వారు బల్దియా కంట్రోల్ రూం నంబర్ 040 2111 1111కు సంప్రదించాలని జీహెచ్ఎంసీ శుక్రవారం ప్రకటించింది. నగరంలో నిర్లక్ష్యంగా సమగ్ర ఇంటింటి సర్వే : జీహెచ్ఎంసీ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దారితప్పింది. హైదరాబాద్‌లో వేలాది అపార్టుమెంట్లకు ఎన్యూమరేటర్లు వెళ్లకుండానే వెళ్లినట్లుగా సర్వే ఫారాలను వారే నింపేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తమకు ఆసక్తి లేదని ఆప్షన్‌తో సర్వే ఫారాలపై ఎన్యుమరేటర్లే పేర్కొంటూ సర్వే ముగిసిందనిపిస్తున్నారు. దాదాపు అధికారులు 20 శాతం ఇళ్లల్లో సమగ్ర కుటుంబ సర్వే చేయలేదు. నగరంలో డిసెంబర్ 2న సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని అధికారులు వెల్లడించినప్పటికీ తమ ఇంటికి ఎవరూ రాలేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో గ్రేటర్ అధికారులు దీనిపై దృష్టి సారించి టోల్ ఫ్రీ



నెంబర్ ఇచ్చారు. కాగా ప్రజల నుంచి సర్వే ద్వారా సేకరించినటువంటి సమాచారం కూడా అసంపూర్తిగా ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఐఏఎస్ అధికారులు, పురపాలకశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించినప్పటికీ ఫలితం నామమాత్రంగానే ఉందని సమాచారం. సుమారు 70 ప్రశ్నలతో రూపుదిద్దుకున్నటువంటి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పత్రాన్ని చూసి ప్రారంభంలో ప్రజలు తమ వివరాలను ఇచ్చేందుకు వెనకడుగు వేశారు. ఈ క్రమంలో ఆందోళన వ్యక్తం చేయగా వెంటనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీంతో సర్వేకు వెళ్లే ఎన్యుమరేటర్లకు తగిన స్వేచ్ఛ ఇచ్చింది. అయితే ఎక్కువ మంది సిబ్బంది ఆ స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోగా మరికొంతమంది దుర్వినియోగం చేశారని ఆరోపణలు వస్తున్నాయి. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో దాదాపు 25 శాతం ఇంటింటికి స్టిక్కర్లు అతికించలేదని సమాచారం. ఆల్విన్ సొసైటీలో ఇంటింటి స్టిక్కర్లను అతికించగా సర్వే మాత్రం జరగలేదు. బాలానగర్ సాయినగర్‌లో ఇళ్లకు స్టిక్కర్లని అంటించి మమ అనిపించారు. పాతబస్తీలోని ఛత్రినాక, గౌలిపుర, మూసబౌలి, శ్రీరామ్‌నగర్ కాలనీ, గాంధీబొమ్మకాలనీ, లంగర్‌హౌజ్‌లోని షేక్‌పేట మారుతినగర్, మారుతినగర్, బంజారాహిల్స్ రోడ్డు నెం.1లోని నవీన్‌నగర్, ఆనంద్‌నగర్‌లోని పలు వీధుల్లో, బేగంపేట మయూరినగర్, బల్కంపేట సాయిబాబా టెంపుల్ వీధి, బ్రాహ్మణవాడి, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, వనస్థలిపురం, ఎస్‌కేడీనగర్ బీఎన్‌రెడ్డి కాలనీతో పాటు మూసాపేట ఆంజనేయనగర్‌లోని పలు అపార్ట్‌మెంట్లను, నిజాంపేట ఇన్‌కాయిస్‌రోడ్డు, గచ్చిబౌలి జనార్ధన్‌హిల్స్ తదితర ప్రాంతాలను గాలికొదిలేశారని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.

# అల్లు అర్జున్ మా బంధువే..

**ఒక ప్రాణం పోయింది.. వెనక్కు తీసుకురాగలరా**

**బన్నీ అరెస్ట్ పై మరోమారు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):
ఫిలిం స్టార్లు, పొలిటికల్ స్టార్ల కోసం ప్రత్యేక చట్టం ఉంటుందా.. కారులో వచ్చి సినిమా చూసి వెళ్తే ఎటువంటి సమస్య ఉండకపోయేది.. కానీ కారులోంచి బయటికి వచ్చి చేతులూపి హీరో అల్లు అర్జున్ హడావుడి చేశారంటూ బన్నీ అరెస్ట్ పై మరోమారు సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఓ టీవీ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక కామెంట్స్ చేశారు. అల్లు అర్జున్ అరెస్టుపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మహనీయులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఉందని, దానికి అనుగుణంగానే చట్టం పనిచేస్తుందన్నారు. గతంలో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ లు ఎందుకు అరెస్ట్ అయ్యారంటూ సీఎం ప్రశ్నించారు. అల్లు అర్జున్ ను అరెస్ట్ చేసామంటున్నారు.. అక్కడ మహిళ చనిపోయింది, ఆమె కొడుకు ఇంకా జీవన్మరణ సమస్యతో బాధపడుతున్నాడు. అటువంటి సంధర్భంలో పోలీసులు కేసు నమోదు చేయడం తప్పు ఎలా అవుతుందంటూ సీఎం అన్నారు. ఘటన జరిగిన పది రోజుల తర్వాత పోలీసులు, అల్లు అర్జున్ ఇంటికి వెళ్లారన్నారు. ఫిలిం స్టార్లు, పొలిటికల్ స్టార్ల కోసం ప్రత్యేక చట్టం ఏముండదన్న విషయం అందరికీ తెలిసిందే అంటూ సీఎం వ్యాఖ్యానించారు. జనం ప్రాణాలు పోతున్నా, కేసులు పెట్టొద్దన్న వాదనను పలువురు తెరపైకి తీసుకురావడం తనకు ఆశ్చర్యకరంగా ఉందంటూ సీఎం స్పందించారు. ఘటన జరిగిన సంధ్యా థియేటర్ వద్దకు వచ్చిన అల్లు అర్జున్ సినిమా చూసి వెళ్లి ఉంటే, ఇంత సమస్య ఉత్పన్నం అయ్యేది కాదన్నారు సీఎం. కానీ కారులోంచి బయటికి వచ్చి చేతులూపి హడావిడి చేయడంతో, తొక్కిసలాట జరిగి మహిళ ప్రాణం పోయిందంటూ.. ఆ ఘటనపై సీఎం రియాక్ట్ అయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్ ను %నూ%11 గా పోలీసులు పేర్కొన్నారని, చిన్నప్పటినుంచి అల్లు అర్జున్ తనకు తెలుసన్న సీఎం, బన్నీకి కూడా తాను తెలుసన్నారు. అంతేకాదు అల్లు అర్జున్ మామ చిరంజీవి కాంగ్రెస్ నేత అంటూనే, అల్లు అర్జున్ కు పిల్లనిచ్చిన మామ చంద్రశేఖర్ రెడ్డి కూడా కాంగ్రెస్ నేతనే అన్నారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి తనకు బంధువని, కానీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. హోం శాఖ తన వద్ద ఉన్న నేపథ్యంలో, ఈ కేసుకు సంబంధించినటువంటి రిపోర్ట్ తనకు పూర్తిగా తెలుసంటూ సీఎం అన్నారు. సినిమా కోసం పైసలు పెట్టారు పైసలు సంపాదించుకున్నారు. వాళ్లు ప్రత్యేకంగా



దేశం కోసం చేసింది ఏం లేదంటూ సీఎం కీలక కామెంట్స్ చేశారు. ఇదే ఇంటర్వ్యూలో తన ఫేవరెట్ హీరో గురించి కూడా సీఎం ఓపెన్ అయ్యారు. తన ఫేవరెట్ హీరో కృష్ణగా తెలిపి.. ఆయన ఇప్పుడు లేరంటూనే కృష్ణ నటించిన సినిమాల గురించి మాట్లాడారు. ఫ్యాన్స్ అందరికీ ఉంటారని, కానీ మనం అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని నడుచుకోవాలన్నారు. నేను కూడా పొలిటికల్ స్టార్ నే కదా.. నాకూ ఫ్యాన్స్ ఉంటారని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు. అయితే ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన పలు కామెంట్స్ వైరల్ గా మారాయి.

# ఐసీయూలో ఎల్‌కే అద్వానీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు): బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ వినిత్ సూరి సంరక్షణలో ఆయనకు చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అద్వానీ వయసు 97 ఏళ్లు. ఆయన గత కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో పలుమార్లు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. తొలుత జూన్ 26న అద్వానీ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. జులై 3న మరోసారి ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఆయన్ని ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన మరోసారి ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.



# మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష లేదు

### వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు : కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు): మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష ప్రదర్శించడం లేదని, వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్, ఇండోనేషియా లాంటి దేశాల్లో ఉన్న ముస్లింలతో పోలిస్తే, భారత్‌లో ముస్లింలు బెటర్‌గా ఉన్నట్లు చెప్పారు. అందుకే పొరుగు దేశాల్లో ఉంటున్న ముస్లింలు కూడా ఆశ్రయం కోరుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. ఇతర దేశాల్లో మైనార్టీలకు కల్పిస్తున్న ఓటింగ్ హక్కుల గురించి కూడా మంత్రి రిజిజు తెలిపారు. దేశం గురించి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత ఇమేజ్‌పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తమ హక్కులను కాపాడుకునేందుకు మైనార్టీలకు న్యాయరక్షణ కల్పిస్తోందని మంత్రి రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్య రంగంలో భారత్‌తో ఏ దేశాన్ని కూడా పోల్చలేమన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో చాలా గ్యాప్‌లు ఉన్నాయని, అందుకే ప్రధాని మోదీ వికసిత్ భారత్ నినాదాన్ని ఇచ్చినట్లు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్లు గడుస్తున్నా.. భారత్‌ను అభివృద్ధి దేశంగా ఎందుకు మార్చలేకపోయారని అడిగారు.



# మహిళపై చిరుత దాడి : తలకు తీవ్ర గాయాలు

### రిమ్స్ ఆసుపత్రికి తరలింపు

ఆదిలాబాద్,డిసెంబర్ 14 (వెలుతురు): ఆదిలాబాద్ జిల్లాలో మరోసారి చిరుత విరుచుకుపడింది. బజార్ హత్నూర్ మండలం డెడ్రాలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసింది. చిరుత దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని స్థానికులు గమనించి.. చికిత్స నిమిత్తం



ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బాధితురాలిని భీమాబాయిగా గుర్తించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవలే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ యువతిపై పులి దాడి చేసి ప్రాణాలు తీసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని కాగజ్‌నగర్ మండల పరిధిలోని బెంగాలీ క్యాంపు ఆరో నెంబర్ విలేజ్ సమీపంలో గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కూలీకి వెళ్లింది. పత్తి చేనులో పత్తి ఏరుతుండగా.. పులి వెనక నుంచి అకస్మాత్తుగా దాడి చేసింది. ఊహించని పరిణామం యువతి పులిని ప్రతిఘటించలేకపోయింది. దీంతో పులి మహిళ మెడ భాగంలో తీవ్రంగా దాడి చేసింది. గమనించిన మిగతా కూలీలు కేకలు వేశారు. పులి అక్కడి నుంచి పారిపోయింది. మిగతా కూలీలు ఆమెను ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో లక్ష్మి ఆస్పత్రికి వెళ్లేలోగా మృతి చెందింది.

# ఇలాంటి ఘటనలు జరిగితే మీరు ఊరుకుంటారా రాహుల్‌జీ...?

### రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 14 (వెలుతురు): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ చేపట్టిన కూల్చివేతలపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మీ కుటుంబంలో జరిగితే, అంగీకరించగలరా..? రాహుల్ గాంధీ జీ అని కేటీఆర్ అడిగారు. పట్టింపు, మానవత్వం లేని ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడుతాయి. తెలంగాణలో ఇంట్లో ఇద్దరు మహిళలు ఉండగానే.. బుల్డోజర్లతో ఆ ఇండ్లను కూలగొట్టారు. మరి వారి భౌతిక భద్రతకు ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పేదలకు ప్రేమ పంచుతాం అనడం అంటే ఇదేనేమో అని కేటీఆర్ విమర్శించారు.



# నేనెక్కడికీ పారిపోలేదు

### అసత్య వార్తాలపై స్పందించిన మోహన్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 14 (వెలుతురు): మంచు మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి హత్యాయత్నం కేసులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా మోహన్ బాబు కనిపించలేదని సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతం వార్తలపై మోహన్ బాబు స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. ఇంట్లోనే వైద్య సంరక్షణలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా ముందస్తు బెయిల్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో ఎలాంటి నిజం లేదు. నేను ఎక్కడికీ పారిపోలేదు. ప్రస్తుతం ఇంట్లో వైద్య సంరక్షణలో ఉన్నాను. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నాను' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.



# ఢిల్లీ పాఠశాలలకు బాంబు బెదిరింపులు

### ఆందోళన చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు): దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. శుక్రవారం దాదాపు 30 పాఠశాలలకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఉదయం కూడా పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే



వచ్చాయి. ఆర్కేపురం, వసంత్ కుంజ్ ప్రాంతాల్లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సహా పలు పాఠశాలలు బెదిరింపులు వచ్చాయి. శనివారం ఉదయం 6:12 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలల వద్దకు చేరుకొని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణల్లో తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, స్కూళ్లలో బాంబులు ఉన్నాయంటూ బెదిరింపులు రావడంతో ఈ వారంలో ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస బెదిరింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# తిరుమలలో భక్తుల రద్దీ

### ఒక్క రోజే స్వామివారిని దర్శించిన 63,722మంది భక్తులు

తిరుమల, డిసెంబర్ 14 (వెలుతురు): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగు తుంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు 7 కంపార్టుమెంట్లలో వేచి యున్నారు. టోకెన్లు లేని భక్తులకు 9 గంటల్లో సర్వదర్శనం కలుగు తుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న 63,722 స్వామివారిని దర్శించుకోగా 22,225 తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.77 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టీటీడీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం డిసెంబరు 28న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు ఈవో శ్యామల రావు తెలిపారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని, భక్తులు 0877-2263261 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



# రైతు పేరు కూడా ఉచ్చరించే అర్హత జగన్‌కు లేదు

### రైతు ఆత్మహత్యల్లో మొదటి స్థానాల్లో నిలబెట్టిన ఘనత జగన్‌ది

### మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అమరావతి, డిసెంబర్ 14 (వెలుతురు): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రైతు అనే పేరు ఉచ్చరించే అర్హత కూడా లేదని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకెళ్లిన ఘనత జగన్‌దని విమర్శిం చారు. శనివారం నెల్లూరులో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... వ్యవసాయ శాఖను చంపేసి, సూక్ష్మ సేద్యం, పోషకాలు, ఇతరత్రా రైతు ప్రోత్సాహకాలు దూరం చేశారని ఆగ్రహించారు. జగన్ వల్ల వ్యవసాయ రంగం ఎంత నష్టపోయిందో పులివెందుల రైతులే చెబుతారని అన్నారు. వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు తాము సిద్ధం, జగన్ సిద్ధమా అని సవాల్ విసిరారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌లో వ్యవసాయానికి, రైతాంగానికి పెద్దపీట వేశామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఏనాడైనా వ్యవసాయ శాఖపై సమీక్ష జరిపారా అని ప్రశ్నించారు. ఏ2, ఏ2 వియ్యంకుడి సాయంతో రేషన్ బియ్యం విదేశాలకు పంపి కోట్లు దండుకోవటం ఒక్కటే జగన్ చేశారని ఆరోపించారు. దేశంలో రైతులపై తలసరి సగటు అప్పు రూ. 74500 ఉంటే.. ఏపీలో 2.45లక్షలు ఉండ టానికి కారణం జగన్ కాదా అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు.. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి– 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించారు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు.

### కూటమి ప్రభుత్వం ఎప్పుడూ

# రైతుల పక్షానే..

### పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


అమరావతి,డిసెంబర్ 14 (వెలుతురు): కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి– 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించారు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధాన్యం కొనుగోలులో అనేక సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసిందని ఆయన ఆగ్రహించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే రైతులు కళ్లల్లో ఆనందం కనపడుతోందని మంత్రి చెప్పారు. రైతులకు అండగా నిలబడకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్ వృథాగా మారుతుందన్నారు. అందుకే వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల గురించే ఆలోచిస్తారని తెలిపారు. వారికి మంచి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం దిగుబడి అధికంగాఉందన్నారు.వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. అలా ఆందోళన చెంది దళారులకు తక్కువ ధరకే విక్రయించవద్దని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని అన్నారు. అందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు చేపట్టిందని... ధాన్యంలో తేమ 20 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా రైతులకు అందించేందుకు టార్పాన్లు సైతం మొదటిసారి అందు బాటులోకి తెచ్చామని చెప్పారు. మిల్లర్లకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించామని అన్నారు. కాబట్టి వారంతా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఉంటే ఏపీలో 2.45 లక్షలు ఉండటానికి కారణం జగన్ కాదా అంటూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



# జమిలి ఎన్నికలకు మా మద్దతు

### ఎన్నికలు జరిగేది 2029లోనే : నారా చంద్రబాబునాయుడు

అమరావతి, డిసెంబర్ 14 (వెలుతురు): దేశంలో జమిలి ఎన్నికలపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనేనని స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం



చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించామని వెల్లడించారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతుందని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారని విమర్శించారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలో పాటు ప్రతిచోటా చర్చ జరగాలని కోరారు. విజన్ 2020 సాకారమైన తీరును నేటితరం తెలుసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 ఒకరోజు కోసం పెట్టి వదిలేసేది కాదని అన్నారు. భవిష్యత్ తరాల బాగుకోసం చేసే ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం కావాలని, రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047అని తెలిపారు. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరాత్ర ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వెల్లడించారు.

# అమెరికాలో ఓపెన్‌ఏఐ మాజీ ఉద్యోగి సుచిర్ బాలాజీ ఆత్మహత్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు): భారత సంతతికి చెందిన ఓపెన్‌ఏఐ మాజీ ఉద్యోగి సుచిర్ బాలాజీ ఆత్మహత్య చేసుకున్నాడు. శాన్‌ఫ్రాన్సిస్‌కోలో 26 ఏళ్ల ఆ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మరణించాడు. నగరంలోని బుచానన్ స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌లో సుచిన్ బాలాజీ మృతదేహాన్ని గుర్తించారు. అతను సూసైడ్ చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మరణం వెనుక ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పేరుగాంచిన ఓపెన్‌ఏఐ సంస్థలో జరుగుతున్న అక్రమాలను సుచిర్ బాలాజీ వెలుగులోకి తెచ్చాడు. ఆ కంపెనీ అనుసరిస్తున్న వ్యాపార విధానంపై ఇప్పటికే పలు దావాలు దాఖలు అయ్యాయి. ఓపెన్‌ఏఐ సంస్థ అమెరికా కాపీరైట్ చట్టాలను ఉల్లంఘించినట్లు మూడు నెలల క్రితం సుచిర్ బాలాజీ ఆరోపించారు. ఆ కంపెనీ అక్రమరీతిలో చాట్‌జీపీటీ డెవలప్ చేసినట్లు అతను పేర్కొన్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్‌కు చెందిన చాట్‌జీపీటీ టెక్నాలజీ ద్వారా ప్రస్తుతం లక్షలాది మంది డబ్బులు ఆర్జిస్తున్నారు. ఓపెన్‌ఏఐ సంస్థ వ్యాపారవేత్తలను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను వేధిస్తున్నట్లు బాలాజీ ఆరోపించారు. సమాజానికి హాని చేసే సంస్థలో ఉండకూడదన్న ఉద్దేశంతో ఓపెన్‌ఏఐ సంస్థను బాలాజీ వదిలివెళ్లాడు.

# మాజీ కేంద్ర మంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ కన్నుమూత

చెన్నై, డిసెంబర్ 14 (వెలుతురు): తమిళనాడు కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ శనివారం కన్నుమూశారు. ఆయన వయసు 73 ఏళ్లు. స్వల్ప అనారోగ్యం కారణంగా ఆయన గత కొన్ని రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నవంబర్ 13వ తేదీన ఎంఐఓటీ హాస్పిటల్‌లో చేరారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన.. నెల రోజుల నుంచి చికిత్స తీసుకుంటున్నారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో .. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు తిరుమగన్ ఇవెర మృతిచెందిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి సోదరుడి మనవడే ఇళంగోవన్. చిన్న వయసులోనే ఇళంగోవన్ రాజకీయ ఎంట్రీ చేశారు. 1984లో ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగా చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా చేశారు.

# రైలు మీది నుంచి వెళ్లినా బతికిపోయాడు


రాయదుర్గం,డిసెంబర్ 14 (వెలుతురు): రాయదుర్గం పట్టణానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి చావబోయి.. బతికిపోయాడు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలుడు మంగళవారం అర్ధరాత్రి స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లాడు.




స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలు పట్టాలపై పడుకున్నాడు. బళ్లారి వైపు నుంచి గూడ్స్ రైలు వస్తుండటంతో ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. లోకో పైలెట్ గమనించి హారన్ కొట్టినా అలాగే రైలు పట్టాల నడుమ విద్యార్థి ఉండిపోయాడు. కానీ రైలు సమీపించగానే లేచి పట్టాల మధ్యలో పడుకున్నాడు. రైలు ముందుకు సాగిపోయింది. బాలుడు చనిపోయి ఉంటాడని భావించిన లోకో పైలెట్.. రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. లొకేషన్‌ను షేర్ చేశారు. దీంతో పట్టాలను తనిఖీ చేసేందుకు గార్డ్ వాహనంలో గ్యాంగ్‌మెన్ వచ్చారు. అప్పటికి ఆ విద్యార్థి పట్టాలపై పడుకుని కనిపించారు. వెంటనే పట్టుకుని ఓబుళాపురం రైల్వేస్టేషన్లో అప్పగించారు. సిబ్బంది డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, విద్యార్థిని అప్పగించారు.

## మార్చి నాటికి గ్రూప్-1, 3 పరీక్షల ఫలితాలు విడుదల చేస్తాం

### - టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం



**హైదరాబాద్,డిసెంబర్ 14 (వెలుతురు):** వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రూప్-1, 3 పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇక రేపు, ఎల్లుండి నిర్వహించబోయే గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ కేవలం సిలబస్ మాత్రమే ఇస్తుందని, ఏ బుక్ చదవాలన్నది అభ్యర్థుల ఇష్టమని ఆయన చెప్పారు. గ్రూప్-2 ఇప్పటి వరకు నాలుగు సార్లు వాయిదా పడింది. హైకోర్టు, సుప్రీంకోర్టులో గ్రూప్-2 ఎగ్జామ్‌కు అన్ని అడ్డంకులు తొలగి పోయాయి. 5 లక్షల 51 వేల మంది గ్రూప్-2 కోసం దరఖాస్తు చేసుకున్నారు. 75 శాతం ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారు. అభ్యర్థులు ధైర్యంగా పరీక్షలు రాయండి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాను అని బుర్రా వెంకటేశం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకం ఉంచి పరీక్షలురాయండి. ఎవరి ఓఎంఆర్ షీట్ వారికే ఉంటుంది. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ తప్పనిసరి. వేగంగా గ్రూప్-2 పరీక్షల ఫలితాలు ఇస్తాం. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించుకున్నాం. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని టీజీపీఎస్సీ చైర్మన్ పేర్కొన్నారు.

## మొదలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వే

### డిసెంబర్ 31 వరకు పూర్తి

### పలు జిల్లాల్లో మార్గ దర్శకాలను జారీచేసిన కలెక్టర్లు

**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక సర్వే మొదలైంది. శనివారం నుంచి మొదలైన ఈ సర్వే, డిసెంబర్ 31 వరకు జరగనుంది. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించిన జిల్లా కలెక్టర్లు అందుకు సంబంధించి మార్గ దర్శకాలను జారీ చేశారు. రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా




ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్ ఉండనున్నారు. పట్టణాల్లో వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్ ఉంటారు. అదే గ్రామాల్లో అయితే గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది వివరాలు సేకరించనున్నారు. ఒకరోజు ముందుగానే సర్వే గురించి గ్రామాలు, వార్డులకు సమాచారం ఇచ్చారు. దీనికి సంబంధించి పత్రాలను రెడీ చేయాలని ఇప్పటికే తెలిపారు. ఇక కలెక్టర్లు, హౌసింగ్ శాఖ పీడీలు దిగువస్థాయికి వెళ్లి యాప్‌లో వివరాల నమోదు తీరును గమనిస్తున్నారు. ఇళ్ల కేటాయింపులో తొలుత వికలాంగులకు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కార్మికులు, ఆదివాసీలకు ప్రయార్టీ ఇవ్వనుంది ప్రభుత్వం. ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇక దరఖాస్తుదారుడు ఉన్న సొంత ఇల్లు లేదా అద్దె ఇంటి ఫోటోలు తీసి అందులో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికితోడు వారికున్న స్థలాల వివరాలు సేకరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అసలైన లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం ఆలోచన. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. కేవలం కార్యకర్తలకు మాత్రమే వచ్చాయి. ఈసారి అలా కాకుండా అసలైన లబ్ధిదారులను న్యాయం జరిగేలా చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఏడాదికి నాలుగున్నర లక్షల మంది ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఓవరాల్‌గా పరిశీలిస్తే రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆలోచన చేస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీ నెరవేరుతుందని అధికార పార్టీ భావిస్తోంది.

## ప్రజలకు మతస్వేచ్ఛ ఉందని ఆర్టికల్ 26 చెబుతోంది

### ప్రధాని మోదీపై అసదుద్దీన్ ఆగ్రహం

### రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 చదవాలని ప్రధానికి సూచన



**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** దేశ ప్రజలకు మతస్వేచ్ఛ ఉందని ఆర్టికల్ 26 చెబుతోందని, మతపరమైన, స్వచ్ఛంద సేవా కార్యకలాపాల కోసం సంస్థలను ఏర్పాటు చేసే స్వేచ్ఛను ఈ ఆర్టికల్ దేశ ప్రజలకు ఇచ్చిందని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కానీ ప్రధాని మోదీ మాత్రం వక్ఫ్ బోర్డుతో రాజ్యాంగానికి సంబంధం లేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేసేముందు ఒకసారి రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను చదువుకోవాలని సూచించారు. ఇంతకీ ప్రధానికి రాజ్యాంగ పాఠాలు చెబుతోంది ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. బలముంది కదా అని వక్ఫ్ ఆస్తులను బలప్రయోగంతో దోచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ భుజానికి ఎత్తుకున్న జాతీయవాదమనేది సాంస్కృతికపరమైది కాదని... అది మతపరమైనదన్నారు. మసీదుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి... మూకదాడుల ద్వారా దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మైనార్టీలు అధికారాన్ని కలిగి ఉండడాన్ని ఎవరూ ఇష్టపడడం లేదని వాపోయారు.

## అల్లు అర్జున్‌పై మాకు ఎలాంటి కక్ష లేదు

### మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా

### చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** సినీ నటుడు అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కక్ష లేదని, అయినా ఆయన కారణంగా ఓ మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమన్నారు. తొక్కిసలాట కారణంగా ఓ పేద మహిళ చనిపోతే చర్యలు తీసుకోవద్దా అన్నారు. అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని, అరెస్ట్ చేశారని, ఆ తర్వాత కోర్టు బెయిల్ (మధ్యంతర) కూడా ఇచ్చిందన్నారు. ఏ నటుడిపై కూడా కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్నారు. తమకు సినిమా వారి పట్ల ప్రేమే ఉందన్నారు.సినిమా తారలపై కేసులు అన్నీ చట్టం పరిధిలోనివే అన్నారు. అల్లు అర్జున్‌పై పెట్టిన కేసును కాంగ్రెస్ పార్టీకి ఆపాదించవద్దని కోరారు. దీనిని అధికార పార్టీకి ఆపాదించే ప్రయత్నం తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# నా ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించలేదు

### మోహన్‌బాబు మరో ట్వీట్

### మీడియా, సామాజిక మాధ్యమాల్లోని వార్తల ఖండన



**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** సీనియర్ నటుడు మోహన్‌బాబు మరోసారి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "ప్రస్తుతం నేను మా ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నాను. నా ముందస్తు బెయిల్‌ను తిరస్కరించలేదు. వాస్తవాలను మాత్రమే బయటపెట్టాలని మీడియాను కోరుతున్నాను." అని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌లో పోలీసులు అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించిందని వార్తలు వచ్చాయి. తాజాగా మోహన్‌బాబు తన పోస్ట్‌లో ఈ వార్తల్లో నిజం లేదని ఖండించారు. మరోవైపు ఈ కేసులో ఫిర్యాదుదారు ఎం.రంజిత్‌కుమార్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈనెల 19వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం. ఈ కేసు మొత్తం నేపథ్యం విలేకరిపై దాడి కేసులో మోహన్‌బాబుకు ఊరట లభించలేదని వార్తలు వచ్చాయి. వారం రోజుల క్రితం హైదరాబాద్‌లోని జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు, మనోజ్ కుమార్ మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మోహన్‌బాబు నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ దంపతులు మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా.. అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేట్లను తెరవలేదు. దీంతో ఆగ్రహానికి లోనైన మంచు మనోజ్ గేట్లను తోసుకుంటూ లోపలికి ప్రవేశించారు. మంచు మనోజ్‌తో పాటు అక్కడే ఉన్న మీడియా ఆయనతో పాటు లోపలికి వెళ్లింది. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈక్రమంలో అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసి.. కొందరిపై ఆయన చేయి చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్ట్‌కు గాయం అయింది. దీంతో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో మంచు మనోజ్, మంచు విష్ణు బాడీగార్డుల మధ్య వివాదం జరిగింది. పరస్పరం ఒకరిని ఒకరు తోసుకుంటూ కాస్త ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. గేట్లు తోసుకుంటూ లోపలికి వెళ్లిన మనోజ్ లోపలినుంచి చొక్కా చిరిగి బయటకు వచ్చారు. వీరి కుటుంబ కలహాలపై పోలీసు శాఖ సీరియస్ అయింది. మంచు మనోజ్, మంచు విష్ణులను పిలిపించి రాచకొండ సీపీ విచారణ చేశారు. మంచు మోహన్‌బాబుకు నోటీసులు ఇచ్చినా ఆరోగ్య బాగోపోవడంతో గచ్చిబౌలిలోని ఆసుపత్రిలో చికిత్సకు వెళ్లారు. దీంతో ఆయన విచారణకు హాజరు కాలేదు. అనంతరం పోలీసులు అరెస్టు కాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మోహన్‌బాబు దాఖలు చేశారు.




## మరోసారి రైతుల ఉద్యమబాట

### డిమాండ్ల సాధన కోసం రైతుల 'చలో ఢిల్లీ'

### చలో ఢిల్లీ మార్చ్‌కు పిలుపు.. అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు):** తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## రేపు వన్‌నేషన్... వన్ ఎన్నికల బిల్లు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (వెలుతురు):** దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ముసాయిదా బిల్లులు ఈనెల 16వ తేదీన లోక్‌సభ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. డిసెంబర్ 16న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే




పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

## ఏపీలో దూసుకోస్తున్న అల్పపీడనం

### పలు జిల్లాల్లో గజగజలాడిస్తోన్న చలి

**అమరావతి, డిసెంబర్ 14(వెలుతురు):** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత అల్పపీడనం మరింత బలపడి తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశం ఉంది. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాలను చలి చంపేస్తుంది. సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి ఉష్ణోగ్రతలు. పొగమంచు ప్రభావం విమాన రాకపోకలపై తీవ్రంగా పడుతుంది.. రెండో రోజూ పలు విమానాలు ఆలస్యమయ్యాయి. ఇటీవలే బంగాళాఖాతంలో అల్పడానికి తమిళనాడుతో పాటు రాయలసీమ దక్షిణ కోస్తా తీవ్రంగా వర్షాలు కురిసాయి. ఆయా ప్రాంతాల్లో పంటలకు కూడా నష్టం వాటిలో ఉంది. ఆ ప్రభావం నుంచి కాస్త ఊపిరి పీల్చుకునేలోపే.. మరో అల్పపీడనం ఉపద్రవం ముంచుకొస్తుంది. దక్షిణ అండమాన్ పరిసర ప్రాంతాలపై ఉపలతల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆదివారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది తదుపరి రెండు రోజుల్లో మరింత బలపడి పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం కూడా తమిళనాడు తీరం వైపే కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏపీ, యానాంలపై ఈశాన్య తూర్పు గాలుల ప్రభావం కనిపిస్తోంది. శనివారం నుంచి మూడు రోజులపాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికనుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తాలో ఎల్లుండి నుంచి వస్తారు వర్షం ప్రభావం కనిపిస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక రెండు తెలుగు రాష్ట్రాలను చలి చంపేస్తుంది. గజగజ వణికిస్తోంది. పగటిపూట ఉష్ణోగ్రతలో క్రమంగా పడిపోతున్నాయి. కొన్నిచోట్ల సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి ఉష్ణోగ్రతలు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో భారీగా చలి తీవ్రత కనిపిస్తోంది. దట్టంగా పొగమంచు కురుస్తోంది. మినుములూరులో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పాడేరు, అరకులలో 10 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అవ్వగా.. చింతపల్లి 12.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎముకలు కొరికే చలిలో గిరిజనులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు కూల్ క్లైమేట్‌ను ఆస్వాదించేందుకు పాడేరు ఏజెన్సీకి భారీగా తరలి వెళ్తున్నారు పర్యాటకులు. విశాఖ ఎయిర్ పోర్ట్‌పై పొగ మంచు ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.

## వేతనాల చెల్లింపులో గప్పాలు కొడుతున్నారు

### ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని అబద్ధాలు

### 14వ తేదీ వచ్చినా జీతాలు రాని పరిస్థితి

### బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు

**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిందేమీ లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. 14 రోజులు గడిచినా ఇంకా జీతాలు రాలేదని మండిపడ్డారు. ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు గప్పాలు కొట్టారని, కానీ ఈ నెల 14వ తేదీ వచ్చినా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేతనాలు చెల్లించలేదని విమర్శించారు. పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు చెల్లించని దుస్థితి నెలకొందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులను కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు... ఇలా ఎంతోమందికి సకాలంలో వేతనాలు రావడం లేదని, దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న ప్రచారం ఇకనైనా ఆపాలన్నారు.

## రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు

### ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** తాము ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవాన్ని చాటేలా పద్యాలు, కవితలు రచించి పుస్తకాలుగా విడుదల చేస్తామన్నారు. ఉద్యమ సమయం తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేసుకుంటూ వెళతామన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని, అందుకే విగ్రహం రూపాన్ని మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుంటే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు.బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని... జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఢిల్లీ నేరాలకూ రాజధానిగా మారింది

### అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ

### డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయని ఆందోళన

**హైదరాబాద్, డిసెంబర్ 14(వెలుతురు):** ఢిల్లీలో పెరుగుతున్న నేరాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీ నేరాలకు కూడా రాజధానిగా మారిందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం



చేశారు. ఢిల్లీలో డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయన్నారు. మహిళలపై నేరాలు, హత్యల్లో ఢిల్లీదే మొదటి స్థానమన్నారు. ఢిల్లీలో బాంబు బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయన్నారు. బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ శాంతిభద్రతలపై తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని కోరారు. భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే ఢిల్లీలోనే అత్యధికంగా నేరాలు జరుగుతున్నాయని విమర్శించారు. నేరాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైమ్ క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయన్నారు.



# కొత్తగా... పండగలా...



సంప్రదాయ వేడుక లేదా పండగ అనగానే పట్టు లంగా ఓణీ తలపుకు వచ్చేస్తుంది. ఎప్పుడూ ఒకే టైప్ డ్రెస్ కోడ్ అనే నేటితరానికి మరికొంచెం కొత్తగా, మరింత ఆకర్షణీయంగా ఉండేలా ఇలాంటి డిజైన్ లెహంగా, దుపట్టాలను ఎంపిక చేయచ్చు. అయితే, కలర్ కాంబినేషన్స్, అలంకరణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్లెయిన్ కలర్స్ అయినా కట్, కుట్టుతో ఇలాంటి కాంబినేషన్ ఆకట్టుకుంటుంది. సంప్రదాయ రంగులు అయితే పెద్ద పెద్ద ఆభరణాలు ధరించినా అందంగా కనిపిస్తారు. అదే, స్పెషల్ అనిపించే గ్రే, లైట్ క్రీమ్, సియాన్.. వంటి రంగులకు ఆభరణాల అలంకరణ అంతగా నప్పవు. డిజైన్‌లో ఉన్న తేడాలను కూడా దృష్టిలో పెట్టుకొని ఇతర అలంకరణపై దృష్టి పెట్టాలి.



ఆకాశం నుంచి నక్షత్రాలు తెచ్చి అల్లినట్టుగా...భూమ్మీద ముగ్గులు తెచ్చి అద్దినట్టుగా... తోకాడించే గాలిపటాల నుగగనానికి పంపినట్టుగా...అంతా పండగలా.. కానీ, కొంచెం కొత్తగా! తెలుగింటి విరిబోణి కట్టు లంగా ఓణీ.

లేత గులాబీని తలపించే బీజ్ టుల్ లెహెంగా, దాని మీద ఆలోవర్ సీక్వెన్ వర్క్ అబ్బురుపరుస్తుంటుంది. దీనికి లేత నీలం రంగు కట్‌వర్క్ దుపట్టా, సీక్వెన్ బ్లౌజ్ ఆకర్షణీయంగా రూపుకట్టింది.

గ్లాస్ బీడ్స్, ముత్యాలు, జర్దోసీల కలయికతో ఎంబ్రాయిడరీ చేసిన రా సిల్క్ లెహెంగా, జాకెట్టు గ్రాండ్‌గా కనువిందు చేస్తుంది. దీనికి రెడ్ కలర్ కట్‌వర్క్ నెటెడ్ దుపట్టా జత చేయడంతో చూపులను కట్టడి చేస్తుంది.

సంప్రదాయ వేడుకలకు చిరునామాగా నిలుస్తాయి ఎరుపు, పసుపు రంగులు. ఎరుపు రంగు రా సిల్క్ మీద సీక్వెన్స్ వర్క్, జియోమెట్రికల్ ప్యాటర్న్ బ్లౌ, కట్‌వర్క్ దుపట్టా లుక్‌ని అందంగా మార్చింది. బెల్ట్ భాగం ప్రత్యేకతను నిలుపుతోంది.

ఫాయిల్‌ప్రింటెడ్ రా సిల్క్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన లెహెంగా ఇది. దీనికిజర్దోసీ వర్క్ చేసిన బ్లౌజ్‌ని జత చేయడంతో యంగ్ లుక్‌ని మరింత ఆకర్షణీయంగా మార్చేసింది. ఇదే రంగు సీక్వెన్ కట్ వర్క్ దుపట్టాతో లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది.

జర్దోసీ, గ్లాస్ బీడ్స్‌తో ఎంబ్రాయిడరీ చేసిన పసుపు లెహెంగా పండగ సమయంలో ధరిస్తే చూపు తిప్పుకోనివ్వదు. లెహెంగా అంచు రంగును పోలిన నీలాకాశపు కట్‌వర్క్ దుపట్టా మింట్ రా సిల్క్ డిజైనర్ బ్లౌజ్ లెహంగాకి పర్‌ఫెక్ట్ మ్యాచ్.

ముదురు ఎరుపు లంగా, జాకెట్టు దానికి క్రీమ్ కలర్ దుపట్టా సరైన కాంబినేషన్. అయితే ఇందుకు ఫ్యాబ్రిక్ ఎంపికలో జాగ్రత్త తీసుకోవాలి. బీజ్ టుల్ లెహెంగా మీద ఆలోవర్ సిక్వెన్ వర్క్, జియోమెట్రికల్ ప్యాటర్న్ బ్లౌజ్, కట్‌వర్క్ నెటెడ్ దుపట్టా కళను రెట్టింపు చేస్తుంది.





## లక్ష్మీ కాసుల గలగలలు

**ప్రతీ ఏటా కాసు**

శ్రావణమాసం వ్రతానికి ప్రతియేటా లక్ష్మీ కాసును కొనడం ఆనవాయితీగా ఉంటుంది చాలామందికి. ఈ కాసులు కొన్ని పోగయ్యాక వాటితో సింపుల్ డిజైన్స్ చేయించుకోవచ్చు. ఇవి ప్లెయిన్ శారీస్, అనార్కలీ వంటి వాటి మీదకూ ధరించవచ్చు.

**మామిడి కాసులు**

మామిడి పిందెల రూపంలో ఉండే కాసులను కూడా ఇప్పుడు తయారు చేస్తున్నారు. వీటిని మ్యాంగోమాల అంటారు. మన సంప్రదాయ వేడుకల్లో మామిడితో ఉన్న అనుబంధం వర్ణించలేనిది. అందుకే



మామిడి పిందెల డిజైన్లు గల జరీ చీరలు, ఆభరణాలు ఎప్పుడూ గ్రాండ్‌గా ఉంటాయి. కనీసం 25 పైసలంత సైజ్‌లో ఉండే కాసులతో తయారయ్యే మాల 30 నుంచి 300గ్రాముల దాకా బరువు ఉంటున్నాయి.

**డైమండ్స్‌కు కాసుల జత**

కాసు హారానికి ఫ్లాట్ డైమండ్స్, సింగిల్ కట్ డైమండ్స్, కెంపులు, పచ్చలు, ముత్యాలతోనూ... ఇలా కంటెంపరరీగా డిజైన్ చేయించుకోవచ్చు. జూకాలు, గాజులు కూడా కాసులతో చేయించుకుంటే పట్టు చీరల మీదకు ఈ డిజైన్ ఆభరణాలు బాగా నప్పుతాయి. వివాహ వేడుకలకు పట్టు చీరల మీదకు కాంబినేషన్‌గా ఎంత హెవీగా ఆభరణాలు వేసుకున్నా అందంగానే ఉంటుంది. వాటిలో బామ్మల కాలం నాటి లక్ష్మీ కాసుల మాలలు/ హారాలు మాత్రం ఎప్పుడూ సవ్వడి చేస్తూనే ఉన్నాయి. అందుకే కాసుల పేరు అనేది ఆధునిక మహిళల మెడలోనూ గలగల మంటోంది.

## ఈ బ్యాగ్ ధరెంతో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే!

హాంగ్‌కాంగ్‌లో క్రిస్టీస్ అనే సంస్థ నిర్వహించిన వేలంలో 2కోట్ల 57లక్షల రూపాయలు చెల్లించి మరీ బ్యాగును ఆమె సొంతం చేసుకున్నారు. అది ప్రఖ్యాత ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ హౌజ్ 'హెర్మ్స్'కు చెందిన బిర్కిన్ బ్రాండ్ బ్యాగు. హ్యాండు బ్యాగుల తయారీ కోసం ప్రత్యేకంగా మొసళ్లను పెంచి మరీ వాటి చర్మంతో బ్యాగులు, పర్సులు తయారు చేసే హెర్మ్స్ కంపెనీ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది అభిమానులు ఉన్నారు. విక్టోరియా బెక్‌హామ్ నుంచి అమెరికన్ టీవీ నటి



కిమ్ కర్దాషియన్ వరకు ఎంతో మంది సెలబ్రిటీలు తమ చేతిలో ప్రఖ్యాత హెర్మ్స్ బ్రాండ్ బ్యాగు ఉండాలని పోటీ పడి వాటిని సొంతం చేసుకుంటారు. బిర్కిన్ బ్యాగు ప్రారంభ ధర 7 వేల డాలర్లకు తక్కువగా ఉండదు.

ప్రస్తుతం ఆసియన్ మహిళ సొంతం చేసుకున్న బ్యాగును హిమాలయన్ నీలో మొసలి చర్మంతో తయారుచేశారు. అరుదైన 245.. 18 క్యారట్ వైట్ గోల్డ్ డైమండ్స్‌తో పొదగబడిన లాక్‌తో రూపొందిన గ్రేడియన్ కలర్ బ్యాగును సొంతం చేసుకోవడానికి ఎంతో మంది ఫ్యాషన్ ప్రియులు పోటీ పడటంతో చరిత్రలో అత్యంత ఎక్కువ ధరకు అమ్ముడుపోయిన బ్యాగుగా రికార్డుకెక్కిందని క్రిస్టీస్ నిర్వాహకులు తెలిపారు.

## వాష్ కరో.. షైన్ కరో..

**బుర్ఖాల కోసం ప్రత్యేక లిక్విడ్ వాష్... సృష్టించిన అక్కాచెల్లెళ్లు దేశంలోనే తొలి ఉత్పత్తిగా వెల్లడి**

అన్ని వస్త్రాలూ ఒకలా ఉండవు. అలాగే అన్నింటికి ఒకే రకమైన వాషింగ్ ఉత్పత్తులూ పనికిరావు. ముఖ్యంగా ఖరీదైన ఫ్యాబ్రిక్స్ ఉపయోగించి రూపొందించే దుస్తుల కోసం మరింత జాగ్రత్తగా వాషింగ్ ఉత్పత్తులను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బుర్ఖాల కోసం నగరానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఓ వైవిధ్యభరితమైన వాషింగ్ లిక్విడ్‌ని రూపొందించారు.




'డార్క్ కలర్ బుర్ఖాలు, వెయిల్స్, స్టోల్స్... వంటివి కొంత కాలం తర్వాత రంగులను కోల్పోయి కళావిహీనంగా మారుతున్నట్టు మా కాలేజ్ డేస్‌లో స్వయంగానూ, స్నేహితుల అనుభవాల ద్వారా గుర్తించాం. అప్పుడే వాటికి సరైన క్లీనింగ్ డిటర్జెంట్ మార్కెట్లో లభించడం లేదని అర్థమైంది' అంటూ చెప్పారు మసరత్ ఖాటూన్, మెహనూర్ ఖాటూన్. నగరానికి చెందిన ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు చదువు పూర్తయిన తర్వాత ఇదే అంశంపై చేసిన మార్కెట్ స్టడీ కూడా ఈ విషయాన్నే నిర్ధారించడంతో... వాషింగ్ ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించాలనుకున్నారు. ఒక సమస్యకు పరిష్కారంతో మార్కెట్లోకి ప్రవేశించాలనుకున్న వీరికి అప్పటికే కెమిస్ట్ అయిన తండ్రి సహకారం కూడా తోడైంది.

'ఖరీదైన డిజైనర్ వేర్ గాఢమైన రసాయనాలతో తయారైన ఉత్పత్తుల వాడకం కారణంగా కాంతిహీనంగా మారుతున్నాయి. త్వరగా ఫేడ్ అవుతుండటంతో స్టోల్స్ తదితర వస్త్రాలను మహిళలు రెగ్యులర్‌గా వినియోగించలేకపోతున్నారు. బుర్ఖాకు వాడే క్లాత్ చాలా సాఫ్ట్‌గా ఉంటుంది. కెమికల్‌తో తయారైన లిక్విడ్ వినియోగిస్తే త్వరగా చిరిగిపోవడం, షేడ్ అవడం జరుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ వుర్ఖా వాష్ రూపొందించాం' అని చెప్పారు. బేగంపేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో బుధవారం దీనిని విడుదల చేసిన సందర్భంగా వీరు మాట్లాడుతూ... ప్రస్తుతం లిక్విడ్ రూపంలో విడుదల చేస్తున్నామని, త్వరలోనే బాటిల్స్ రూపంలోనూ అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ఉత్పత్తికి సంబంధించి రిసెర్చ్, ప్రయోగాలన్నీ చండీఘడ్‌లో చేశామని, నగరంలో తయారీ జరుగుతోందన్నారు. బుర్ఖాలకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన తొలి వినూత్న వాషింగ్ ఉత్పత్తిగా వీరు పేర్కొన్నారు.

## మీ లుక్ ఇలా మార్చుకోండి

ఎత్తు తక్కువ ఉన్నవారు పొడవుగా కనిపించాలన్నా, సన్నగా ఉన్నవారు కొంచెం బొద్దుగా కనిపించాలన్నా ఈ చిన్న చిన్న కిటుకులు పాటించాలి. ఎత్తు తక్కువ ఉన్నవారు చిన్న అంచు(బార్డర్) లేదా అసలు అంచు లేని చీరలు కట్టుకుంటే పొడువుగా కనిపిస్తారు. చర్మరంగుకు దగ్గరగా ఉండే రంగు దుస్తులను ధరిస్తే మీ రూపం పొడువుగా కనిపిస్తుంది. సన్నగా ఉన్నవారు అలంకరణలు ఎక్కువ ఉన్న అంటే గ్రాండ్‌గా ఎంబ్రాయిడరీ చేసిన దుస్తులు, చీరలు కట్టుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తారు.నలుపు, ఎరుపు, నీలం.. వంటి బాగా ముదురు రంగు దుస్తుల మీదకు బంగారు ఆభరణాలు ధరిస్తే అందం రెట్టింపు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. బొద్దుగా ఉన్నవారు చర్మం రంగు దుస్తులు ధరిస్తే మరింత లావుగా కనిపిస్తారు.బొద్దుగా, ఎత్తు తక్కువ ఉన్నవారు చారల దుస్తులు, చీరలు ధరించాలంటే.. నిలువు చారలున్నవి ఎంచుకోవాలి.





# నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు

## రానాకు సమంత బర్త్‌డే విషేస్

రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు.

ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.






# ఖైదీ నెంబర్ 7697

## జైలులో బన్నీ ఏం చేశాడంటే..?

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తికాకపోవడంతో నైట్ అంతా జైలులోనే గడిపాడు అల్లు అర్జున్. అయితే జైలులో ఉన్న అల్లు అర్జున్‌కి అధికారులు ఎలాంటి వసతి కల్పించారు. బన్నీ ఎలా ఉన్నాడు అనే దానిపై ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. అల్లు అర్జున్‌ని చంచల్‌గుడాలోని వీఐపీ బ్లాక్ ఉంచినట్లు తెలుస్తుంది. ఇక జైలులో ఉన్న అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీగా యూటీ 7697 నంబర్‌ను అధికారులు కేటాయించారు. రాత్రంతా మంజీరా బ్యారక్‌లోని బ్లాక్ -1లో అల్లు అర్జున్‌ని ఉంచగా.. తెల్లవారేవరకు అల్లు అర్జున్ నిద్రపోకుండానే గడిపినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ పడుకునే ముందు జైలు సిబ్బంది రగ్గు దుప్పటి ఇచ్చినట్లు సమాచారం. అయితే వీటిని తిరస్కరించి అల్లు అర్జున్ నేలపైనే పడుకున్నట్లు.. ఇక జైలులో ఉన్నంత సేపు అధికారులతో తప్ప ఎవరితో బన్నీ మాట్లాడలేదని తెలుస్తుంది. రాత్రి జైలులో అధికారులు భోజనం అందించగా.. కొంచెం తిని పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 5.45 గంటలకు బన్నీని జైలు నుంచి బయటకు తీసుకువచ్చి.. విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తిచేసినట్లు.. ఉదయం 6.39 గంటలకు విడుదల చేసినట్లు సమచారం.



# సారంగపాణి జాతకం..

టాలీవుడ్ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా నటిస్తున్న మరో మూవీ సారంగపాణి జాతకం. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్టైనర్ గా శివలింగ కృష్ణ ప్రసాద్ రూపొందిస్తున్న ఆ సినిమాకు మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్నారు. మోహనకృష్ణ, శివలింగ కృష్ణ ప్రసాద్ కాంబోలో ప్రేక్షకుల ముందుకు రానున్న మూడో సినిమా ఇదే కావడం విశేషం. గతంలో వారిద్దరూ కలిసి జెంటిల్ మెన్, సమ్మోహనం సినిమాలకు గాను వర్క్ చేశారు. ఆ రెండు మంచి హిట్స్ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ సారంగపాణి జాతకం చిత్రం కోసం చేతులు కలిపారు. దీంతో ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రియదర్శి హీరోగా నటిస్తుండగా.. రూప కొడువాయూర్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు.

అయితే సారంగపాణి జాతకం సినిమాను డిసెంబర్ 20న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టారు. కొద్ది రోజుల క్రితం టీజర్ ను రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంటూ కడుపుబ్బా నవ్విస్తూ అలరించింది. సినిమాపై అంచనాలు పెంచింది. టీజర్ ప్రకారం.. సినిమాలో హీరో జాతకాలు బాగా నమ్ముతాడు. మరి ఆ జాతకాలపై ఎక్కువ నమ్మకం వల్ల హీరో లైఫ్ లో ఏం జరుగుతుంది? ఎలాంటి మార్పులు వచ్చాయి? ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడా? కీచకుడి వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారు? వంటి ప్రశ్నలకు సమాధానాలే సినిమాగా తెలుస్తోంది.

అయితే ఇప్పుడు సారంగపాణి జాతకం మూవీ రిలీజ్ డేట్ పై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. విడుదల వాయిదా పడే అవకాశం కనిపిస్తుందని అంటున్నారు. డిసెంబర్ 20వ తేదీన మాత్రం రిలీజ్ అవ్వదని చెబుతున్నారు. డిసెంబర్ 31వ తేదీన కానీ జనవరి మూడో వారంలో విడుదల చేసే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. కొందరు సంక్రాంతికి రిలీజ్ అవుతుందేమోనని చెబుతున్నా.. అఫీషియల్ గా ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. కానీ అప్పుడు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు. సంక్రాంతికి పోటీ ఉన్నా.. సారంగపాణి జాతకం వంటి కామెడీ సినిమాలు క్లిక్ అయితే పెద్ద సినిమాలున్నా కూడా బాగా ఆడుతాయి. మరి సారంగపాణి జాతకం చిత్రం సంక్రాంతికి రిలీజ్ అవుతుందో లేదో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# పట్టువిడువని ప్రశాంత్ వర్మ..

యంగ్ టైగర్ ప్రశాంత్ వర్మ 'హనుమాన్' తర్వాత ఇప్పటి వరకు కొత్త సినిమా స్టార్ట్ చేయలేదు. పాన్ ఇండియా రేంజ్ లో హనుమాన్ బ్లాక్ బస్టర్ కొట్టడంతో వెంటనే దానికి సీక్వెల్ గా 'జై హనుమాన్' స్టార్ట్ చేయాలని అనుకున్నారు. ఆరంభంలో ఈ సినిమాలో హనుమంతుడి పాత్ర కోసం హీరోలు దొరకలేదు. దీంతో ఆ ప్రాజెక్ట్ హెూల్డ్ లో పెట్టి రణవీర్ సింగ్ తో కొత్త సినిమాని స్టార్ట్ చేశాడు. అతనికి కథ చెప్పి ఒకే చేయించుకున్నాడు.

ఈ సినిమా పట్టాలు ఎక్కే సమయంలో క్యాన్సిల్ అయ్యింది. క్రియేటివ్ డిఫరెన్స్ కారణంగా ఈ ప్రాజెక్ట్ రద్దయ్యిందని క్లారిటీ వచ్చింది. తరువాత నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞని హీరోగా పరిచయం చేసే బాధ్యత తీసుకున్నాడు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లోనే సూపర్ హీరో కథతోనే ఈ సినిమా ఉంటుందని ఎనౌన్స్ చేశారు. స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ చేయడంతో ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి చేసి షూటింగ్ ని వెళ్లాలని డిసైడ్ అయ్యారు.

100 కోట్లకి పైగా బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మించడానికి నిర్మాతలు కూడా సిద్ధమయ్యారు. అయితే షూటింగ్ మొదలవుతుందనుకునే రోజే సడెన్ గా మూవీ హెూల్డ్ లో పడిందనే టాక్ బయటకొచ్చింది. మోక్షజ్ఞ ఆరోగ్యం బాగోకపోవడంతో ఈ సినిమా షూటింగ్ వాయిదా పడిందని బాలయ్య చెప్పారు. అయితే అంతర్గతంగా ఇంకేదో జరిగిందనే మాట వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందని అనుకుంటున్నారు. వాస్తవం ఏంటనేది బయటకి రాలేదు. మరో వైపు 'జై హనుమాన్' కోసం రిషబ్ శెట్టిని మెయిన్ లీడ్ గా తీసుకున్నారు. పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అయితే రిషబ్ శెట్టి ప్రస్తుతం 'కాంతారా 2' పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యాకే 'జై హనుమాన్' స్టార్ట్ చేస్తారు. ఈ లోపు డార్లింగ్ ప్రభాస్ తో కథ ఫైనల్ చేయించుకోవాలని ప్రశాంత్ వర్మ ప్లాన్ చేస్తున్నారంట. ఇదివరకే రెండు మూడు సార్లు కలిశారు. కానీ కథ విషయంలో ప్రభాస్ పూర్తి



స్థాయిలో సంతృప్తి చెందలేదని టాక్. అయినప్పటికీ మళ్ళీ ప్రయత్నం మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వీలైనంత వేగంగా ప్రభాస్ ని ఒప్పించి ఈ సినిమా అయిన పట్టాలు ఎక్కించాలని ప్రశాంత్ వర్మ అనుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. హెూంబలే ఫిలిమ్స్ భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మించడానికి సిద్ధంగా ఉంది. ఒకవేళ కథ విషయంలో ప్రభాస్ నిర్మాతలు సంతృప్తి చెందితే జనవరిలోనే ఈ మూవీకి సంబంధించి అధికారిక కన్ఫర్మేషన్ రావొచ్చని అనుకుంటున్నారు. ఇక ప్రభాస్ లైనప్ చాలా బిజీగా వుంది. ప్లాన్ చేసినా డేట్స్ దొరకడం అంత ఈజీ కాదు. ఇక రిషబ్ శెట్టి ఈ మూవీకి కథ అందించాడని ప్రచారం జరుగుతోంది. అయితే అందులో వాస్తవం ఎంత అనేది తెలియదు. ఈ సినిమాని ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగానే తెరకెక్కించే ప్లాన్ లో ఉన్నట్లు తెలుస్తోంది.



# అల్లు అర్జున్‌ను చూసి ఎమోషనల్ అయిన చిరంజీవి భార్య

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టైన టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి శనివారం ఉదయం 6.40 గంటలకు విడుదలయిన విషయం తెలిసిందే. జైలు నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడకి చేరుకున్న అల్లు అర్జున్ మేనత్త, చిరంజీవి భార్య సురేఖ అల్లు అర్జున్‌ను చూసి భావోద్వేగానికి గురైంది. అల్లు అర్జున్ కూడా మేనత్తని చూసి దగ్గరికి వెళ్లి హాగ్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## ఆ కుటుంబానికి ఆమె లోటు ఎవరూ పూడ్చలేనిది

### బాధిత కుటుంబానికి అండగా ఉంటా: అల్లుఅర్జున్




సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో శనివారం ఉదయం జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చారు. అయితే ఉదయమే మీడియాతో మాట్లాడిన అల్లు అర్జున్ తాజాగా మరోసారి మీడియా ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరం. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆ కుటుంబానికి మరోసారి నా క్షమాపణలతో పాటు సానుభూతి తెలుపుతున్నా. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటాను. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. గత 20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా.. కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. నాకు అండగా నిలిచిన అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు అంటూ అల్లు అర్జున్ చెప్పుకోచ్చాడు.

## అల్లుఅర్జున్ అరెస్టుపై ప్రముఖ నటుల కామెంట్లు



సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే అత్యుత్సాహం సాధారణ పౌరుల రక్షణలో కూడా చూపిం చాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు.

**నమ్మలేక పోతున్నా : నాని**



ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు.

**బాధాకరం : రష్మిక**

సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి.



**దురదృష్టకరం : అనిల్ రావిపూడి**

థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య.



**అన్యాయం : అడవి శేష్**

ఈ ఘటన బాధాకరం. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్లు చుట్టు పక్కల వారికి సూచిస్తుంటారు. ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయం.



**జవాబు చెప్పాలి : వరుణ్ ధావన్**

అల్లు అర్జున్ ఏమైనా టెర్రరిస్టా? ఇంట్లోకి దూరి అరెస్ట్ చేయడం ఏమిటి? ఈ అరెస్టుపై రేవంత్ రెడ్డి అందరికీ జవాబు చెప్పాలి.

## ఘటనలో మీడియా తప్పు లేదు : మంచు మనోజ్



మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు తెలుపగా.. తాజాగా ఈ విషయంపై నటుడు మంచు మనోజ్ స్పందించాడు. ఈ ఘటనలో మీడియా తప్పు లేదు. నిస్సహాయ స్థితిలో నేను మీడియాను లోపలికి తీసుకువెళ్లాను. మా ఇంట్లోకి నన్ను అనుమతించకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని తీసుకువెళ్లా. లోపలికి వెళ్లిన అనంతరం తనపై దాడి జరిగింది. ఈ ఘటనలో అసలు మీడియా తప్పు లేదు అంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com